ఈనాడు
సూర్యాపేట
బుధవారం అక్టోబరు 2, 2024

బతుకమ్మతో సంస్కృతి విశ్వవ్యాప్తం: జగదీశ్‌రెడ్డి



సూర్యాపేట (తాళ్లగడ్డ), న్యూస్‌టుడే: తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ పండగ ప్రతీకగా నిలుస్తుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పితృ అమావాస్య ప్రారంభంతో.. ఆరంభం కానున్న బతుకమ్మ, దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ఆనందంగా నిర్వహించుకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతిని ఆరాధిస్తూ జరుపుకొనే బతుకమ్మ పండగతో తెలంగాణ సంస్కృతి విశ్వవ్యాప్తమైందని తెలిపారు.

హైడ్రాతో భయభ్రాంతులకు గురిచేయొద్దు

కుడకుడరోడ్డు(సూర్యాపేట), న్యూస్‌టుడే: సూర్యాపేట పట్టణంలోని సద్దుల చెరువు పక్కన ఉన్న పేదల ఇళ్లను హైడ్రా పేరుతో తొలగిస్తామంటే ఊరుకోమని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని 30వ వార్డు ప్రజలతో మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో పేద ప్రజలకు అండగా ఉంటామని సంఘీభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పేరుతో గత అరవై ఏళ్లుగా నివాసముంటున్న పేదల ఇళ్లను కూల్చివేస్తామనడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఈ చర్యను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత పేద ప్రజల పక్షాన సీపీఎం పోరాటం చేస్తుందని హెచ్చరించారు. నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, రవి, నర్సయ్య, సాయికుమార్, తదితరులున్నారు.


ఇందిరానగర్ కాలనీ వాసులతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి

బాపూజీ మాటే.. చైతన్య బావుట

◆ నేడు మహాత్మాగాంధీ జయంతి

అహింస, శాంతి అనే రెండు ఆయుధాలతోనే రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి.. దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించి పెట్టిన జాతిపిత మహాత్మాగాంధీ. నేటి సమాజానికి ఆయన సూచించిన అహింస, మహిళా సాధికారత, స్వచ్ఛత బాట మనకు ఎంతో అవసరం. నేడు 'మహాత్మాగాంధీ జయంతి' సందర్భంగా 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం. మిర్యాలగూడ పట్టణం, మేళ్లచెరువు, న్యూస్‌టుడే:

"నీతిలేని వాణిజ్యం, కృషిలేని సంపద, శీలం లేని విద్య, త్యాగంలేని ఆరాధన, మానవత్వం లేని శాస్త్రజ్ఞానం, నియమనిష్టలు లేని రాజకీయం.. ఇవే సామాజిక పాపాలు." - మహాత్మా గాంధీ

స్వచ్ఛతతోనే ఆరోగ్య సిరులు

మహాత్మాగాంధీ కలలు గన్న అంశాల్లో ప్రధానమైనది స్వచ్ఛత. ఆయన ఆశయాల సాధనలో భాగంగా సరిగ్గా పదేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాన్ని ప్రారంభించింది. పలు నగరాలు, పట్టణాల్లో మురికివాడలు, వాటిలో నివసించే పేదల అభ్యున్నతే గాంధీజీ ధ్యేయం. ప్రస్తుత సమాజంలో చైతన్యం కరవై.. అధికారుల్లో నిర్లక్ష్యం అధికమై స్వచ్ఛత కనుమరుగైంది. దీంతో ఇటీవల ఉమ్మడి జిల్లాలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారి.. దోమలు వ్యాప్తి చెంది వేలాది మంది విషజ్వరాల బారిన పడ్డారు. స్వచ్ఛతలో నల్గొండ పురపాలిక ఇటీవలే జాతీయ స్థాయిలో రెండో బహుమతి సాధించింది. నల్గొండ పురపాలికను ఆదర్శంగా తీసుకుని మిగతా పట్టణాల్లో ప్రజలు, అధికారులు సంఘటితంగా స్వచ్ఛతను పాటిస్తే పరిసరాలు పరిశుభ్రమవుతాయి. గాంధీజీ ఆశయం నెరవేరుతుంది.

"మీరు చీపురు, బకెట్ మీ చేతుల్లోకి తీసుకోనంత వరకు.. మీ పట్టణాలు, నగరాలను శుభ్రం చేయలేరు"

ప్రధాన పట్టణాల్లో నిత్యం సేకరించే ప్లాస్టిక్ వ్యర్థాలు (కిలోల్లో)..

పట్టణం	ప్లాస్టిక్ వ్యర్థాలు..
నల్గొండ	150
సూర్యాపేట	40
మిర్యాలగూడ	30
యాదగిరిగుట్ట	40

మహిళా సాధికారతే లక్ష్యం

స్వాతంత్ర్యోద్యమంలో కీలకంగా వ్యవహరించిన మహిళలు ఆర్థికంగా అభ్యున్నతి సాధిస్తే ఆ దేశం ప్రగతి పథంలో వెళ్తుందని గాంధీజీ నమ్మకం. ఇటీవల ఉమ్మడి జిల్లాలోని మహిళలు పలు రంగాల్లో రాణిస్తూ.. మహిళా సాధికారత దిశగా అడుగులు వేస్తున్నారు. యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలంలో స్వర్ణభారతి సహకార పరపతి సంఘం ఘనతే ఓ ఉదాహరణ.. అక్కడ 17 గ్రామాల్లో మహిళల సమైక్య జీవన సౌందర్యం ఉట్టిపడుతోంది. వారి ఐక్యత రూ.30 కోట్ల లావాదేవీలకు ఊతమిచ్చింది. కొన్నేళ్ల కిందట ఆ మగువలంతా నిరుపేదలే. పూట గడవని స్థితి నుంచి పిల్లల్ని ఉన్నత చదువులకు పంపే స్థాయికి ఎదిగారు.

"మహిళలు మేధోపరంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా పురుషులతో సమానంగా ఉంటారు. వారు స్వతంత్రతో, ఆత్మవిశ్వాసంతో ఉండేలా విద్యావంతులను చేయాలి. వారికి ఆర్థిక స్వాతంత్ర్యం అందించేందుకు వివిధ నైపుణ్యాలలో శిక్షణ ఇవ్వాలి"

ఉమ్మడి జిల్లాలో మహిళా సంఘాల సభ్యుల వివరాలు..

జిల్లా/పట్టణం	సభ్యులు
నల్గొండ	2,83,000
సూర్యాపేట	1,76,250
యాదాద్రి	1,49,490
కోదాడ	30
భువనగిరి	20



ప్రతినబూనుదాం

ఏ ఆయుధంతోనైతే మహాత్ముడు దేశానికి స్వేచ్ఛా, ఊపిరిలూదారో.. ఆ ఆయుధమైన అహింస నేటి సమాజంలో కనుమరుగవుతోంది. గాంధీజీ జయంతిని పురస్కరించుకుని ఏటా అక్టోబరు 2న 'అంతర్జాతీయ అహింసా దినోత్సవాన్ని' నిర్వహించుకుంటారు. ఉమ్మడి జిల్లాలోని కొందరు యువత దుర్వ్యసనాలతో చదువులను అర్ధంతరంగా ఆపేసి.. మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారు. ఆర్థిక అవసరాలు తీర్చలేదని విచక్షణ రహిత దాడులకు దిగుతున్నారు. మత్తులో విచక్షణ కోల్పోయి తల్లిదండ్రుల ప్రాణాల్నే తీస్తున్న ఘటనలు అనేకం వెలుగు చూస్తున్నాయి.

★ ఇటీవల మిర్యాలగూడలోని ఓ కాలనీలో 12 ఏళ్ల బాలుడు.. ఐదేళ్ల బాలికపై అసభ్యంగా ప్రవర్తించడంతో పెద్దలు.. రాయబారం నడిపి రాజీ కుదిర్చారు. ఆ కాలనీలో యువత నిత్యం మత్తు పదార్థాలు తీసుకుంటూ.. చేస్తున్న చర్యలే ఆ బాలుడికి ప్రేరణగా నిలిచాయని స్థానికులు చెబుతున్నారు. అహింసా వాదాన్ని ప్రేరేపించే చర్యలను పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలి.


"సత్యం, అహింస నా మతం. నిజాన్ని దైవంగా భావిస్తా.. అహింస రూపంలో దేవుడిని దర్శిస్తా"

ఆదర్శ గ్రామం.. శ్రీరంగాపురం

నడిగూడెం, న్యూస్‌టుడే: మద్యపానానికి బానిసలై కుటుంబాలు ఛిద్రమవుతున్నాయని గ్రామస్థులంతా కలిసికట్టుగా ముందుకు వచ్చి గ్రామంలో మద్యపానం నిషేధించాలని తీర్మానించారు. దీని అమలుకు గ్రామస్థులతో కలిసి కమిటీ వేశారు. 2013లో తీసుకున్న నిర్ణయం నేటికీ అమల్లో ఉంది. అదే నడిగూడెం మండలంలోని శ్రీరంగాపురం గ్రామం. గ్రామంలో ఎక్కడా మద్యం దుకాణాలుండవు. గ్రామస్థులంతా ఇళ్లలో మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు నిర్మించుకుని నూరు శాతం పారిశుద్ధ్య గ్రామంగా 2023లో అవార్డుకు ఎంపిక కావడం గమనార్హం.

గ్రామస్థుల సహకారంతో..

కొల్లు రామారావు, నాటి సర్పంచి

సర్పంచిగా ఉన్నప్పుడు గ్రామస్థుల ప్రతిపాదనతో కమిటీ వేశాం. గ్రామంలో ఎవరైనా మద్యం విక్రయించినా, తాగినా రూ.500 జరిమానా విధిస్తామని ప్రకటించాం. టాంటాం వేశాం. కమిటీ సభ్యుల పహారాతో కొన్ని రోజులు నిబంధన అమలు చేశాం. తరువాత గ్రామస్థులే స్వచ్ఛందంగా కమిటీకి సహకరించడంతో నాటి నుంచి నేటి వరకు నిషేధం అమల్లో ఉంది.


శ్రీరంగాపురం గ్రామ పంచాయతీ

కొనసాగిస్తాం: కృష్ణయ్య, కమిటీ అధ్యక్షుడు

గ్రామంలో మద్యపానాన్ని నిషేధిస్తున్నామని కమిటీ తీసుకున్న నిర్ణయానికి అందరూ సహకరిస్తున్నారు. దీంతో కమిటీ పనితీరు సులభతరంగా మారింది. దశాబ్దకాలం పాటు మా నిర్ణయం అమల్లో ఉండటం నిజంగా ఆదర్శనీయం. ఇది ఇలాగే కొనసాగిస్తాం.

వయో వృద్ధులను గౌరవించాలి: కలెక్టర్

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని, వయో వృద్ధులు ఆరోగ్యం, ఆస్తిని ఎప్పుడూ కాపాడుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ వయో వృద్ధులు దినోత్సవం సందర్భంగా జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వయో వృద్ధులను గౌరవంగా చూడాలన్నారు. వృద్ధుల కోసం సూర్యాపేటలో నిర్మిస్తున్న సంక్షేమ భవనాన్ని డిసెంబరు వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వారి కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలన్నారు. తమ కుమారులు పోషించడం లేదని ప్రజావాణిలో ఫిర్యాదులు రావడం బాధ వేసిందన్నారు. ప్రతి శుక్రవారం వృద్ధులు ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనంతరం వారికి నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించి సన్మానం చేశారు. డీడబ్ల్యూవో నర్సింహారావు, ఆర్డీవో వేణుమాధవ్, డీఎస్పీ రవి కుమార్, వయో వృద్ధుల సంఘం అధ్యక్షుడు రాంబాబు, కార్యదర్శి అమీర్ ఖాన్, ఓల్డేజ్ హోమ్ ఇన్‌ఛార్జి సత్యనారాయణ, విజయమ్మ, సావిత్రమ్మ, అధికారులు పాల్గొన్నారు.


సూర్యాపేట: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

యువత నచ్చిన రంగంలో కష్టపడి ఎదగాలి

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: యువత స్వామి వివేకానంద, భగత్‌సింగ్‌ల ఆలోచనలు అనుసరించాలని అదనపు కలెక్టర్ బీఎస్.లత సూచించారు. సూర్యాపేటలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి యువజన-2025 ఉత్సవాలకు ఆమె హాజరై స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేశంలో నిరక్షరాస్యత, మూఢ నమ్మకాలు ఎక్కువగా ఉన్నాయని యువత వాటిపై ప్రజల్లోకి వెళ్లి సందేహాలు తొలగించాలని తెలిపారు. నచ్చిన రంగంలో కష్టపడి జీవితంలో ఎదగాలని సూచించారు. అనంతరం జానపద నృత్యం, జానపద గేయం పోటీలలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జిల్లా యువజన, క్రీడా అధికారి రాంచందర్‌రావు, ఎస్వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సూర్యాపేట: యువజనోత్సవంలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

నిల్వకు నీడలేదు.. తూకానికి చోటులేదు

★ సాగు విస్తీర్ణం పెరగడంతో అద్దెకు దొరకని భూములు


కనగల్: ఏమిరెడ్డిగూడెంలో గతంలో ఐకేపీ కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేసిన స్థలంలో పంటల సాగుకు ఏర్పాట్లు

ఈనాడు, నల్గొండ - న్యూస్‌టుడే, కనగల్

నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లకు స్థలాల కొరత ప్రతిబంధకంగా మారింది. ఈ సీజన్‌లో భారీ వర్షాలకు తోడు, రెండు రాష్ట్రాల వరప్రదాయిని నాగార్జున సాగర్ నిండుకుండగా మారడంతో గతేడాదితో పోలిస్తే సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. భారీ దిగుబడులతో పాటు సన్నాలు ఎక్కువగా అమ్మకానికి వస్తాయనే నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే అధికారులు 1005 కొనుగోలు కేంద్రాలను ప్రతిపాదించారు. ఇందులో సుమారు 35 శాతం కేంద్రాలకు స్థలాల కొరత ఉందని ప్రాథమికంగా తెలిసింది.

	నల్గొండ	సూర్యాపేట	యాదాద్రి
కొనుగోలు కేంద్రాలు	375	340	290

● జిల్లా ● కొనుగోలు కేంద్రాలు

అంచనాలు ఇలా..

ప్రస్తుత సీజన్‌లో 10.53 లక్షల ఎకరాల్లో వరి సాగయ్యింది. ఈ సీజన్ నుంచే ప్రభుత్వం సన్నాలకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా సుమారు 5.5 లక్షల ఎకరాల్లో సన్నరకాలు సాగవుతున్నాయి. ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు భారీగానే వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సన్న, దొడ్డు రకాలు కలిపి 15.6 లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు కేంద్రాలకు రానున్నట్లు అధికారులు భావిస్తున్నారు. కరోనా సమయంలో ఉమ్మడి జిల్లాలో సుమారు 13 లక్షల ఎంటీల వరకు కొనుగోలు చేశారు. ఈ సీజన్‌లో అది దాటే అవకాశం ఉన్నట్లు తెలిసింది. 'కొనుగోళ్లకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా వ్యవహరిస్తున్నామని, స్థలాలు లేని చోట్ల ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామ'ని సంబంధిత అధికారులు వెల్లడిస్తున్నారు.

ప్రత్యామ్నాయంపై దృష్టి

సాధారణంగా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సీజన్ల వారీగా ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేకుంటే ప్రైవేటు వ్యక్తుల భూములను అద్దెకు తీసుకుంటారు. భూగర్భజలాలు పెరగడంతో ఇన్నాళ్లు పడావు ఉన్న భూములూ సాగులోకి వచ్చాయి. గ్రామాల్లో రెండు నుంచి మూడెకరాల వరకు భూమి ఉంటే అందులో ఒక సీజన్‌లో కొనుగోలు కేంద్రం నిర్వహిస్తే నెలకు సదరు యజమానికి రూ.10 వేల వరకు చెల్లించేవారు. ఇప్పుడు రూ.15 వేల వరకు ఇస్తామన్నా పల్లెల్లో భూమి దొరకని పరిస్థితి. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ధాన్యం కోతలు ప్రారంభమయ్యాయి. మరో పక్షం రోజుల్లో పూర్తిస్థాయిలో కోతలు ప్రారంభమై కొనుగోలు కేంద్రాలకు సరకు పోటెత్తనుంది. స్థలాల కొరత ఉన్న చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఉన్నతాధికారులు సూచిస్తున్నారు.

★ ఈ సీజన్‌లో వరిసాగు విస్తీర్ణం : 10.56 లక్షల ఎకరాలు
★ దిగుబడి అంచనా : 28 లక్షల ఎంటీలు
★ కొనుగోలు కేంద్రాలకు రానున్న దొడ్డు, సన్నరకాలు: 15.5 లక్షల ఎంటీలు

అగ్ని ప్రతిష్ఠాపన.. అకల్మష హోమం

మఠంపల్లి, న్యూస్‌టుడే: మట్టపల్లి క్షేత్రంలోని స్తంభోద్భవుని సన్నిధిలో నిర్వహిస్తోన్న పవిత్రోత్సవాలలో మంగళవారం అగ్ని ప్రతిష్ఠాపన, అకల్మష హోమాలు జరిగాయి. వైఖానస శాస్త్రానుసారం త్రయాహ్నిక దీక్షతో చేపట్టిన ఈ క్రతువుల్లో ఉదయం వాస్తు పూజ, పంచగవ్య ప్రోక్షణల అనంతరం సత్సంప్రదాయంగా అగ్ని మథనం, ప్రతిష్ఠాపన చేశారు. అకల్మష హోమం పూర్తయ్యాక పవిత్రాల ఆవాహనం, హరిద్రోదకప్రోక్షణలు మంత్రయుక్తంగా జరిపి రామాయణ, భాగవత పారాయణలు చేశారు. సాయంత్రం అగ్నిధ్యానం, పంచశయ్యాధివాసాలు పూర్తయ్యాక సుదర్శన యంత్రస్థాపన, బలిహరణలతో పవిత్రోత్సవాలలో రెండో రోజు కార్యక్రమాలు ముగిశాయి. బుధవారం శతకలశ స్నపన, సుముహూర్త కాలంలో పవిత్రారోపణం ఉంటాయని ధర్మకర్తలు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్ తెలిపారు.


మట్టపల్లి శ్రీస్వామి సన్నిధిలో పంచగవ్య ప్రోక్షణ నిర్వహిస్తున్న యాజ్ఞికులు

పూల పండగొచ్చె ఉయ్యాలో..


తుంగతుర్తిలోని శ్రీవిద్యాభారతి ఉన్నత పాఠశాలలో బతుకమ్మలతో ఉపాధ్యాయినులు, విద్యార్థినులు


నేరేడుచర్లలో..


నడిగూడెం: బతుకమ్మలతో విద్యార్థులు

మహాలయ అమావాస్యను పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ సంబరాలను మంగళవారం వేడుకగా నిర్వహించుకున్నారు. విద్యార్థినులు, ఉపాధ్యాయినిలు కలిసి తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చారు. వాటి చుట్టూ పాటలు పాడుతూ కోలాటం వేస్తూ ఆడిపాడారు. అనంతరం స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు.

- న్యూస్‌టుడే, బృందం

నేడు 'పేట' మార్కెట్ యార్డుకు సెలవు

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డు, కార్యాలయానికి బుధవారం గాంధీ జయంతి సందర్భంగా సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి ఆర్.సంతోష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయమై అన్నదాతలు గమనించి మరుసటి రోజు యథావిధిగా మార్కెట్‌కు పంట ఉత్పత్తులు తీసుకురావాలని కోరారు.

కలెక్టరేట్ దారికి.. పసుపు శోభ



జిల్లా కేంద్రంలోని నూతన కలెక్టరేట్ 60 అడుగుల రోడ్డుకు నూతన శోభ సంతరించుకుంది. గతేడాది అధికారులు రహదారికిరువైపులా మొక్కలు నాటారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఏపుగా పెరిగి పసుపు పూలు విరివిగా పూశాయి. దీంతో శ్రీరాంనగర్‌కాలనీ నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు పసుపు పచ్చని అందాలు ఆకట్టుకుంటున్నాయి. ఉదయం, సాయంత్రం నడకకు వచ్చే వారు ఆహ్లాద వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు. - న్యూస్‌టుడే, భానుపురి

సెలవుల రద్దీ..!


ప్రయాణికులతో కిటకిటలాడుతున్న సూర్యాపేట కొత్తబస్టాండ్

కుడకుడరోడ్డు(సూర్యాపేట): రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలకు బుధవారం నుంచి ఈనెల 14 వరకు దసరా సెలవులు ప్రకటించారు. ముందుగా తమ స్వస్థలాలకు చేరుకొనేందుకు సూర్యాపేట పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల, వసతి గృహాల విద్యార్థులు మంగళవారం సాయంత్రం ఆర్టీసీ కొత్త బస్టాండ్‌కు చేరుకున్నారు. సమయానుసారం ఆయా ప్రాంతాలకు వెళ్లే బస్సులు రాకపోవడంతో ఇంటికి చేరుకొనేందుకు గంటలకొద్దీ వేచి ఉన్నారు. ఈ విషయమై ఆర్టీసీ డీఎం సురేందర్‌ను అడగగా.. సాధారణ రోజుల కంటే హైదరాబాద్‌కు అదనంగా 10 సర్వీసులను, గ్రామాలకు రద్దీకి అనుగుణంగా ఆయా ప్రాంతాలకు బస్సులు నడిపిస్తున్నట్లు తెలిపారు.

శిశువుల ఊపిరికి ఊతం..!

☛ అత్యవసర పరిస్థితుల్లో 108 నియోనేటల్ వాహన సేవలు


సూర్యాపేట నియోనేటల్ వాహనంలో శిశువుకు వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది (పాత చిత్రం)

సూర్యాపేట (తాళ్లగడ్డ), న్యూస్‌టుడే:

నవజాత శిశువు సంరక్షణలో భాగంగా గత ఏడాది ఆగస్టు నుంచి ప్రభుత్వం '108' నియోనేటల్ వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలకు ఒక్కో వాహనం చొప్పున మొత్తం మూడు వాహనాలను అందించింది. అత్యవసర వైద్యం అవసరమైన వేలాది మంది శిశువుల ప్రాణాలను రక్షించడంలో వాహనాల సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు రెండు వేల మంది శిశువులకు సేవలందించింది.

వాహనంలోనే మినీ ఐసీయూ

అప్పుడే జన్మించిన శిశువు నుంచి 30 రోజుల(నెల)లోపు వయస్సు పిల్లలను నియోనేటల్‌గా పరిగణిస్తారు. ముఖ్యంగా అప్పుడే జన్మించిన శిశువులు ఎక్కువగా శ్వాస, గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతుంటారు. సకాలంలో పెద్దాసుపత్రులకు తరలించాలంటే అంబులెన్సులోనే మినీ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ) వంటి వ్యవస్థ అవసరం. సరిగ్గా అదే విభాగాన్ని అధునాతన పరికరాలతో 108 నియోనేటల్ వాహనాన్ని రూపొందించారు. కృత్రిమ శ్వాస అందించే వెంటిలేటర్, ఆక్సిజన్, నాడీ, రక్తపోటును పరీక్షించే మానిటర్, బయటి నుంచి శ్వాస అందించే బ్యాగ్‌మాస్క్ డివైజ్, శిశువును వెచ్చగా ఉంచే బేబీ వార్మర్ లాంటి యంత్ర పరికరాలు అందుబాటులో ఉంటాయి. ఒక్కో వాహనంలో నిరంతరం అందుబాటులో ఉండేలా ఇద్దరు చొప్పున ఈఎంటీలు, మరో ఇద్దరు పైలెట్లను నియమించారు.

సూర్యాపేట జిల్లాలో ఆరు నెలలుగా వాహనంలో పెద్దాసుపత్రికి తరలించిన కేసుల సంఖ్య

నెల	కేసుల సంఖ్య
ఏప్రిల్	42
మే	45
జూన్	41
జులై	45
ఆగస్టు	43
సెప్టెంబరు	47

శిశు మరణాల రేటు తగ్గుతోంది

- నజీరొద్దీన్, ఉమ్మడి జిల్లా మేనేజర్, నల్గొండ



ఈ వాహనాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత ఉమ్మడి జిల్లాలో శిశు మరణాల రేటును తగ్గించగలిగాం. అనారోగ్యంతో జన్మించిన శిశువులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు శిక్షణ పొందిన సిబ్బంది పర్యవేక్షణలో పెద్దాసుపత్రులకు తరలిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రాసుపత్రులకు, అవసరమైతే జిల్లా కేంద్రాసుపత్రుల నుంచి హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రికి తరలిస్తున్నాం. వాహనంలో అందుబాటులో ఉన్న వెంటిలేటర్ సాయంతో కృత్రిమ శ్వాస, నియోనేటల్ వార్మర్ సాయంతో తల్లి గర్భంలో ఉన్న ఉష్ణోగ్రతను అందిస్తూ ప్రాణాలు రక్షిస్తున్నాం. ఈ సదుపాయంతో పేద తల్లిదండ్రులపై రూ.వేలల్లో ఆర్థిక భారంతోపాటు మానసిక ఆందోళన తప్పుతోంది.

(c) eenadu




బతుకమ్మ ఆడుతున్న మహిళలు (పాతచిత్రం)

ఇంతినిండుగా.. పూల పండగ

ప్రకృతిని పూజించే గొప్ప సంస్కృతి మనది. తీరొక్క పూలను తీసుకువచ్చి బతుకమ్మగా పేర్చి పూజలు చేసే సంప్రదాయం తెలంగాణ సొంతం. చిన్నారులు, యువతులు, మహిళలు, వృద్ధులు ఆడుతూ.. పాడుతూ.. కష్టాలు మరిచేలా చేసే అరుదైన వేడుక ఇది. మహిళలకు ఇష్టమైన పూల పండగ బతుకమ్మ రానే వచ్చింది. పల్లె.. పట్టణం అంతటా 'బతుకమ్మ, బతుకమ్మ ఉయ్యాలో'.. అంటూ సాగే పాటలు మారుమోగనున్నాయి. నేటి నుంచి ఎంగిలిపువ్వు బతుకమ్మతో సంబరాలు ప్రారంభం కానున్నాయి. - మోత్కూరు, సూర్యాపేట సాంస్కృతికం, నాంపల్లి, న్యూస్‌టుడే

- తెలంగాణ సంస్కృతికి పట్టుకొమ్మ బతుకమ్మ పర్వదినం
- నేటి నుంచి సంబరాలు షురూ

ఆశ్వయుజ మాసంలో రాష్ట్రంలో జరుపుకొనే పండగల్లో అత్యంత విశిష్టమైనది బతుకమ్మ. ఆడపడుచులు ఆత్మీయదేవతగా కొలిచే ఈ పూలరాసి పండగ ప్రకృతి ప్రాముఖ్యాన్ని చాటుతుంది. 'ఎన్ని కష్టాలు వచ్చినా.. ఆపదలు మీదపడినా.. ఆత్మస్థైర్యంతో ముందుకు కదలాలి. కలకాలం నిండు నూరేళ్ల బతుకును పండగలా తీర్చిదిద్దుకోవాలంటూ బతుకమ్మ సందేశాన్నిస్తుంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఈ నెల 2 నుంచి బతుకమ్మ సంబురాలు మొదలై.. తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి. ఏటా సూర్యాపేట, నల్గొండ, భువనగిరి, నకిరేకల్, హుజూర్‌నగర్ పట్టణాల్లో బతుకమ్మ పండగను ఘనంగా నిర్వహిస్తున్నారు.



పూలను పేర్చడం ఓ కళ

బతుకమ్మ పండగలో ప్రత్యేకం ఆట పాటలు, అలంకరణ. బతుకమ్మ పేర్చేటప్పుడు రెండు, ఐదు, ఏడు రకాల పూలను వాడుతారు. తూర్పు, ఉత్తరం వైపుగాని కూర్చొని పేర్చుతారు. తాంబాలంలో గుమ్మడి ఆకులు పరిచి దానిపై పసుపు, కుంకుమలతో బండారు వేస్తారు. చుట్టూ ముత్తైదువులకు బొట్టు ఇచ్చి పేర్చడం ప్రారంభిస్తారు. పక్కనే నిండు నీళ్ల చెంబును ఉంచుతారు. తప్పనిసరిగా తంగేడు పూలు మొదటివరసలో పేర్చుతారు. తరువాత గునుగు వరస, మిగతావి వరసల్లో బంతి, సీతమ్మజడ, పోకబంతి, బీరపువ్వు, తదితరాలను అలంకరిస్తారు.

ఏడురకాల పూలతో బతుకమ్మను, మరో చిన్న బతుకమ్మను తోడుగా పేర్చుతారు. పసుపుతో గౌరమ్మను చేసి చిక్కుడాకుల్లోగానీ, తమలపాకుల్లోగానీ పెడతారు. పత్తితో వస్త్రం చేసి అలంకరిస్తారు. ఇంటి అనవాయితీ అనుసరించి ఒకతల, రెండుతలల గౌరమ్మను తయారు చేస్తారు. మంగళహారతులు సమర్పిస్తారు.

బతుకమ్మ సారం ఇదే ఉయ్యాలో..

మహిళలను గౌరవిద్దాం..: పితృదేవతలను స్మరించుకునే రోజు మొదలయ్యే బతుకమ్మ మహిళలను గౌరవించటం నేర్పే పండగ. ఇంటిల్లిపాదీ చల్లగా ఉండాలని గౌరమ్మను వేడుకునే పర్వదినం. మహిళలను గౌరవించటం, ఆదరించటం, ప్రేమానురాగాలతో వారిని చేరదీయడం, అమ్మతనంపై భక్తి లాంటి సందేశాలు ఈ వేడుకలో ఇమిడి ఉన్నాయి. మానవజాతి మనుగడ స్త్రీని గౌరవించటంలో ఉందని చాటుతుంది.

'మొక్క'వోని దీక్ష: పువ్వు అంటే రేపటి ఫలం. నేటి మొక్కే రేపటి జీవనాధారం. చెట్ల ప్రాధాన్యం, పువ్వు గొప్పతనాన్ని, జలం, భూమితో మానవునికి ఉన్న సంబంధాలు, కుటుంబ బంధాలను తెలిపే బతుకమ్మ పాటలు అనేకం వీటిని బతికించుకునేందుకు పుట్టినవే.

వివక్షకు తావులేకుండా..: కుల, మత, ధనిక, పేద బేధం లేని పండగ ఇది. వివక్షలకు తావులేని సమాజం కోరుకునే ఇందులో దాగిన అంతర్యం.

జలవనరుల శుద్ధి..: వివిధ రకాల పూలు, ఆకులతో బతుకమ్మలను పేర్చి తిరిగి వాటిని చెరువులు, నదులు, పంటకాల్వల్లో వదులుతారు. అనేక ఔషధ గుణాలున్న పూలు నీటిని శుభ్రపర్చి జలచరాలను కాపాడతాయి. ఇది శాస్త్రీయంగా నిరూపణ జరిగింది. - హుజూర్‌నగర్, న్యూస్‌టుడే



హుజూర్‌నగర్‌లో బతుకమ్మ ఆట, పాట(పాత చిత్రం)

రోజుకో బతుకమ్మ.. నైవేద్యాలు

మొదటి రోజు ఎంగిలిపువ్వు బతుకమ్మ: వక్కలు, తులసీ ఆకులు, సత్తుపిండి నైవేద్యం
అటుకుల బతుకమ్మ: పప్పు, బెల్లం, ప్రసాదం
ముద్దపప్పు బతుకమ్మ: బెల్లం వేసి ఉడికించిన సెనగ పప్పు
నానబియ్య బతుకమ్మ: పాలలో నానబెట్టిన బియ్యం పిండిలో బెల్లం
అట్ల బతుకమ్మ: అట్లు/దోశ నైవేద్యం
అలిగిన బతుకమ్మ: కొన్నిచోట్ల బతుకమ్మను పేర్చరు, ఆడరు.
వేపకాయల బతుకమ్మ: పప్పు, బెల్లం
వెన్నముద్దల బతుకమ్మ: నువ్వులు, బెల్లం కలిపిన ముద్ద
తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ: పెరుగన్నం, చిత్రాన్నం, కొబ్బరిపొడి, నువ్వులపొడి ఇలా... ఐదురకాల సద్దులతో నైవేద్యం సమర్పిస్తారు



చౌటుప్పల్‌లో బతుకమ్మ ఆడుకోవడానికి వెళ్తున్న మహిళలు

'పల్లె'వించిన పాట

తెలంగాణ గ్రామీణ జీవనంతో ముడిపడి ఉన్న ప్రతి అంశాన్ని బతుకమ్మ పాటలో వినవచ్చు. ప్రతి చరణం చివర ఎక్కువగా 'ఉయ్యాలో', 'కోల్', 'చందమామా', 'వలలో' వంటి పదాలు వినిపిస్తాయి. జన జీవనం, మహిళల కోర్కెలు, భావనలూ, ఆలోచనలనూ అంతర్లీనంగా వినిపిస్తాయి. వర్షాకాలంలో పంటలు పండుతున్న కాలంలో బతుకమ్మ వస్తుంది. అందుకే ప్రకృతిలక్ష్మీ స్వరూపంగా పూజిస్తారు. సద్దుల రోజు బతుకమ్మను సమీపంలోని చెరువులు, కుంటలు, నదుల్లో, ఆలయ ప్రాంగణాల్లో కోనేర్లు, బావుల్లో వదిలిపెడుతూ పోయిరావమ్మ బతుకమ్మ.. పోయిరావమ్మా... మళ్లొచ్చే ఏడాది మళ్లీరావమ్మా. .అంటూ పాటలు పాడుతూ సాగనంపుతారు.

ఇది మన సంస్కృతి..

– మర్రి జయశ్రీ, కవయిత్రి, మోత్కూరు



తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేదే బతుకమ్మ పండగ. ప్రకృతిని ఆరాధించే ఈ పూల పండుగ మహిళలకు ఎంతో ఇష్టమైనది. నా చిన్నతనం నుంచి ఇప్పటి వరకు ఈ పండుగ ప్రాశస్త్యం ఏమాత్రం తగ్గడం లేదు. ఇంకా పెరుగుతోంది. బతుకమ్మ పేర్చడంలో, పాటలు పాడటంలో అదే సంప్రదాయం కొనసాగుతోంది.

గడువు ముగిసె..!

★ ఉమ్మడి జిల్లాలో రావాల్సిన సీఎంఆర్ 4.53 లక్షల మెట్రిక్ టన్నులు


హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: రావాల్సిన సీఎంఆర్ బియ్యం రాలేదు.. మిల్లర్లకు ఇచ్చిన గడువు మాత్రం గత నెల 30తో ముగిసింది. బకాయి సీఎంఆర్ వసూలుకు మళ్లీ గడువిస్తే తప్ప వసూలయ్యే అవకాశం లేదు. ఇందుకు అధికారులు, మిల్లర్లు ఎదురు చూస్తున్నారు. 2023-24 వానాకాలం, యాసంగి సీజన్ల సీఎంఆర్ బకాయిలను వసూలు చేసేందుకు జులై మొదటి వారం నుంచి 90 రోజులు గడువు ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో వానాకాలం, యాసంగివి కలిపి గత నెల 21 నాటికి 4,53,399 మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉంది. ప్రస్తుతం ఆ గడువు ముగిసింది. మరో వారం రోజుల్లో కొత్త ధాన్యం వస్తున్న క్రమంలో ఇంకా సీఎంఆర్ బకాయిలు ఉండటం అధికారులకు సమస్యగా తయారైంది. పాత బకాయి ఉన్నవారికి కొత్త ధాన్యం కేటాయింపులు చేయకూడదు. వానాకాలం సీజన్‌లో భారీగా ధాన్యం వస్తున్న క్రమంలో బకాయిదారులు అంటూ పక్కన పెడితే కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలింపు తలనొప్పిగా మారుతుంది. మరోసారి గడువు పెంచడం తప్ప వేరే మార్గం లేదని అధికారులు చెబుతున్నారు.

2023-24 వానాకాలం, యాసంగి సీఎంఆర్ వసూలు వివరాలు (సెప్టెంబరు 21 నాటికి మెట్రిక్ టన్నుల్లో..)

జిల్లా	వసూలైన బియ్యం	బకాయిలు
వానాకాలం:		
నల్గొండ	1,89,215	28,361
సూర్యాపేట	75,590	64,564
యాదాద్రి	1,38,848	40,039
యాసంగి:		
నల్గొండ	1,39,613	82,113
సూర్యాపేట	40,604	1,22,989
యాదాద్రి	68,721	1,15,333

యాదాద్రి స్వర్ణతాపడం ఆకృతి ఖరారు..!

ఈనాడు, నల్గొండ : స్వయంభు క్షేత్రమైన శ్రీ యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ విమాన గోపురాన్ని స్వర్ణమయం చేయడానికి అనువుగా అధికారులు వేగంగా కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా కీలకమైన స్వర్ణమయ ఆకృతిని తాజాగా ఖరారు చేసినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. యాదాద్రి స్వర్ణతాపడ పనులపై ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మంత్రి కొండా సురేఖ సమీక్ష నిర్వహించారు. ఆకృతి ఖరారుతో త్వరలోనే పనులు మొదలు కానున్నాయి. తొలుత స్వర్ణతాపడాన్ని 127 కిలోల బంగారంతో చేయాలని నిర్ణయించినా వివిధ కారణాలతో దాన్ని 65 కిలోలకు తగ్గించారు. ఇందుకు దేవస్థానం వివిధ వర్గాల నుంచి విరాళాలు సేకరిస్తోంది. ఇప్పటి వరకు 11 కిలోల బంగారంతో పాటు రూ.20 కోట్ల నగదు సమకూరినట్లు సమాచారం. ప్రస్తుతం బంగారం ధరలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో విరాళాల ద్వారా వచ్చిన నగదుతో బంగారం కొనుగోలు చేయాలని అధికారులు భావిస్తున్నారు. బంగారు తాపడంపై ఒక ట్రెండు రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడవుతాయని దేవస్థాన కీలక అధికారి ఒకరు 'ఈనాడు'కు వెల్లడించారు.



నయనానందకరం.. అమ్మరూపం

◆ 3 నుంచి దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

సూర్యాపేట సాంస్కృతికం, న్యూస్‌టుడే: సకల శుభాలకు మూలం విజయదశమి. ఆ రోజు ఏ కార్యం తలపెట్టినా మంచి ఫలితాలు ఇస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. హిందువుల పెద్ద పండగల్లో విజయదశమి ముఖ్యమైంది. ఈ నెల 3వ తేదీ నుంచి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. దుర్గామాత రోజుకో అవతారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా పట్టణాల్లోని కాలనీలలో, ఊరూరా కమిటీ సభ్యులు మండపాలను సిద్ధం చేసి తొమ్మిది రోజులు నిష్ఠతో దుర్గాదేవి అమ్మవారిని పూజించేందుకు ఏర్పాటుచేస్తున్నారు.

3న ఆదిలక్ష్మి: ఈ నెల 3న అమ్మవారు ఆదిలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. భగవంతుడిని గుర్తించడానికి ప్రధాన లక్షణమైన అమ్మకు లక్ష్మీ అని పేరు. భగవద్ తత్వాన్ని లక్ష్మీ అమ్మతోనే గుర్తించడంతో ఆ పేరు వచ్చిందని పండితులు చెబుతున్నారు.

4న సంతానలక్ష్మి: సకల చరాచర జగత్తు అంతా అమ్మవారి సంతానమే. అందుకే అమ్మవారు సంతాన లక్ష్మి అని ప్రతీతి. సంతాన లక్ష్మి రూపంలో ఉన్న అమ్మవారిని దర్శిస్తే ఆటంకాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం.

5న గజలక్ష్మి: గజలక్ష్మి అవతారంలో ఉన్న అమ్మవారిని ఆరాధించి దేవేంద్రుడు త్రైలోక్యాధిపతి అయినట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది. ఈ అవతారంలో ఉన్న అమ్మవారిని ఆరాధిస్తే మహా సంపద కలుగుతుందని విశ్వసిస్తారు.



6న ధనలక్ష్మి: ఈ సృష్టిలో ధనం అంటే విద్యా, హిరణ్య, శక్తి, ఈ మూడు విధాలైన ధనాన్ని ప్రసాదించే అమ్మను ధనలక్ష్మి మాతగా కొలుస్తుంటాం.

7న ధాన్యలక్ష్మి: ఈ రోజు అమ్మవారిని ధ్యానలక్ష్మిగా పూజలందుకోనుంది. ధనధాన్యం సిద్ధించాలని అమ్మవారిని కొలుస్తుంటారు. భూమి మీద ధన ధాన్యాన్ని ప్రసాదించే అమ్మవారే. అమ్మవారిని ఆరాధిస్తే సకల బాధలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం.

8న విజయలక్ష్మి: అమ్మవారు విజయలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. అమ్మవారిని జ్ఞానేశ్వరి విజయప్రధాయని అని కీర్తిస్తుంటారు. మనం ఏ పని తలపెట్టిన విజయం సాధించాలని అమ్మవారిని కొలిస్తే తప్పక చేకూరుతుందని విశ్వసిస్తారు.

9న ఐశ్వర్యలక్ష్మి: ఐశ్వర్య రూపంలో దర్శనం ఇచ్చే అమ్మవారిని కొలిస్తే సకల సంపదలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తారు. ఐశ్వర్యం అంటే శాసనపరమైన శక్తి సామర్థ్యాలు అని అర్థం. అఖిలాండ కోటి బ్రహ్మాండాలకు శాసకురాలు అమ్మవారు.

10న వీరలక్ష్మి: అమ్మవారు వీరలక్ష్మిగా ఆవిర్భవించి మహిషాసురుడిని సంహరించింది. ఉపద్రవాలను పారదోలి సకల శుభాలను కలుగజేస్తుందని భక్తుల నమ్మకం.

11న మహాలక్ష్మి: అష్టలక్ష్మీ రూపాలను ధరించిన అమ్మ కరుణా స్వరూపమైన నిజరూపంలో భక్తులను అనుగ్రహిస్తుంది. మనిషికి అవసరమైన ధనం, ధాన్యం, సంతానం, విద్య, ఇలా అన్ని అవసరమైన అష్టైశ్వర్యాలను మహాలక్ష్మీ అమ్మవారు ప్రసాదిస్తారు.

కూతురుని వివాహం చేసుకున్నాడని తోడల్లుడి హత్య

డిండి, న్యూస్‌టుడే: కూతురు వరుసయ్యే బాలికను తీసుకెళ్లి వివాహం చేసుకున్నాడని పగ పెంచుకొని ఓ వ్యక్తిని అతని తోడల్లుడు, కుమారులు హత్య చేసిన ఘటన నల్గొండ జిల్లాలో సెప్టెంబరు 27న చోటు చేసుకుంది. డిండి మండలం చెర్కుపల్లిగేటు సమీపంలో ఇటీవల జరిగిన ఈ హత్య కేసులో ఐదుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించినట్లు పోలీసులు తెలిపారు. డీఎస్పీ గిరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా డిండి మండలం కామెపల్లి గ్రామానికి చెందిన రమాదేవికి కేతేపల్లి మండలం కొప్పోలు గ్రామానికి చెందిన శ్రీపతి జగదీష్‌కు పదేళ్ల క్రితం వివాహం జరిగింది. కొన్నేళ్ల పాటు హైదరాబాద్‌లో కలిసి జీవించారు. రెండేళ్ల నుంచి భార్యాభర్తల మధ్య విభేదాలు రావడంతో రమాదేవి తల్లిదండ్రుల వద్దకు వచ్చి జీవిస్తుంది. పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు జరిగినా జగదీష్ వైఖరిలో మార్పు రాలేదు. రమాదేవి మరో సోదరి నిర్మలకు నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం కొరటికల్ గ్రామానికి చెందిన కొంకి పెద్దయ్యతో వివాహం జరిగింది. కూతురు వరుస అయ్యే పెద్దయ్య కుమార్తె (బాలిక)తో జగదీష్‌కు ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. వీరిద్దరు ఆరు నెలల క్రితం వివాహం చేసుకున్నారు. బాలికను కిడ్నాప్ చేశాడని ఆమె తల్లిదండ్రులు అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో జగదీష్ బాలికతో కలిసి ఉంటున్న ఫొటోలను వాట్సప్ గ్రూపుల్లో బంధువులకు పంపించడం మొదలు పెట్టాడు. పరువు పోతుందని భావించిన పెద్దయ్య... సెప్టెంబరు 27న కుమారులు మధు, అరవింద్‌లతో పాటు భార్య నిర్మల, మరదలు రమాదేవితో కలిసి కారులో వారు నివాసం ఉంటున్న అల్వాల్‌కి వెళ్లారు. నిద్రిస్తున్న జగదీష్‌ను కాళ్లు, చేతులు తాళ్లతో.. నోరు, కళ్లు చున్నీలతో కట్టి కారులో దేవరకొండ మీదుగా చెర్కుపల్లికి తీసువచ్చారు. సమీపంలోని గుట్టకు తీసుకెళ్లి జగదీష్‌ను రాళ్లతో పెద్దయ్య, మధు, అరవింద్‌లు హత్య చేశారు. నిర్మల, రమాదేవిలు బయట కాపలా ఉన్నారు. సెప్టెంబరు 28న రైతులు గుర్తు తెలియని శవం ఉందని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి వెళ్లి పోలీసులు దర్యాప్తు ప్రారంభించి పెద్దయ్యను విచారించగా.. కుమారులు అరవింద్, మధుతో కలిసి జగదీష్‌ను హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. స్థానిక పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. 24 గంటల్లో కేసు ఛేదించినందుకు డిండి గ్రామీణ సీఐ సురేష్, ఎస్సైలు రాజు, సతీష్, సతీష్‌లతో పాటు సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డు ప్రకటించినట్లు డీఎస్పీ తెలిపారు.

తల్లి దూరమై.. కసాయి నాన్న జైలుపాలై

- అమ్మను తలచుకొని రోదిస్తున్న చిన్నారులు

లాలించేందుకు అమ్మలేదు.. బుజ్జగించేందుకు నాన్న లేడు. అభం శుభం తెలియని ఆ చిన్నారులకు తమ తల్లిని మట్టిలో పూడ్చిన విషయమే పదే.. పదే గుర్తుకొచ్చి రాత్రిళ్లు నిద్రలోంచి ఉలిక్కిపడి లేచి రోదిస్తున్న వారి దైన్యస్థితి స్థానికులను కంట తడిపెట్టిస్తోంది. నాన్న క్షణికావేశం ఆ ముగ్గురు చిన్నారులకు తల్లిని శాశ్వతంగా దూరం చేయగా.. తండ్రి జైలుపాలయ్యాడు. నల్గొండ జిల్లా నకిరేకల్ మండలం కడపర్తిలో అమ్మమ్మ, తాతయ్య వద్ద ఆశ్రయం పొందిన చిన్నారుల పరిస్థితి ఇది. కడపర్తికి చెందిన దాసరి వీరయ్య-రాములమ్మ దంపతుల కుమార్తె సరిత, సూర్యాపేట జిల్లా చిలుకూరుకు చెందిన దాసోజు బ్రహ్మచారి పదేళ్ల క్రితం కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి తొమ్మిదేళ్ల లోపు కుమార్తెలు మనోజ్ఞ, మోక్షజ్ఞ, కుమారుడు విశ్వ ఉన్నారు. విద్యుత్తు కార్మికుడిగా పనిచేస్తున్న బ్రహ్మచారి మద్యానికి బానిసై పనిచేయకుండా, కుటుంబాన్నీ పట్టించుకోవడం మానేశాడు. డిగ్రీ చదివిన భార్య సరిత సూర్యాపేటలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్న క్రమంలో ఈ ఏడాది ఆగస్టు 14న రాత్రి భార్యతో గొడవపడ్డాడు. ఆమె మెడకు వైరుచుట్టి హత్యచేసి జైలుకెళ్లాడు. వీరి ముగ్గురు పిల్లలు అనాథలుగా మారారు. వృద్ధులైన అమ్మమ్మ, తాతయ్యలు ఈ చిన్నారులను చేరదీసి కడపర్తికి తీసుకొచ్చారు. ప్రస్తుతం కడపర్తి ప్రభుత్వ పాఠశాలలో మనోజ్ఞ 5వ తరగతి, మోక్షజ్ఞ 3వ తరగతి, విశ్వ నర్సరీ చదువుతున్నారు. కాసేపు ఆడుతూ.. పాడుతూ ఉండే చిన్నారులు.. అంతలోనే తల్లి గుర్తుకు వచ్చి మౌనంగా కూర్చుంటున్నారని తాతయ్య ఆవేదన చెందుతున్నారు. గ్రామంలో రేకుల ఇల్లు మినహా ఎలాంటి ఆస్తిపాస్తులు లేవని, జీవిత చరమాంకంలో ముగ్గురు చిన్నారుల భారం తమపై పడిందని, దారి చూపాలని వేడుకొంటున్నారు. - నకిరేకల్, న్యూస్‌టుడే



అమ్మ చిత్రపటంతో అమ్మమ్మ, తాతయ్య చెంత ముగ్గురు చిన్నారులు

పెద్దలు.. దీవెనలందించే పెత్తరమాస

చిట్యాల, న్యూస్‌టుడే: పితృదేవతలను తలచుకొని వారిపేరిట తర్పణాలు విడిచే కాలాన్ని 'మహాలయ పక్షం', 'పితృపక్షం' అని పిలుస్తుంటారు. భాద్రపద బహుళ పాడ్యమి నుంచి అమావాస్య మధ్యనున్న (సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు) 15 రోజుల కాలాన్ని 'మహాలయ పక్షం'గా పరిగణిస్తారు. మనిషి ఎంత ఎదిగినా, తన జన్మకి, సంస్కారం, సంస్కృతికి కారణమైన మన పెద్దలే వాటికి మూలాలని మరిచిపోకుండా తండ్రి, తాత, ముత్తాతలను తలచుకొని పుత్రులు నిర్వహించే ఓ కార్యక్రమం ఇది. శ్రాద్ధ, తర్పణ, పిండ ప్రదానంతో కూడిన పితృ యజ్ఞ విధులను, ఏటా ఒకరోజు వారిని తలచుకునేందుకు హిందూ పురాణాల్లో నిర్దేశించినదే మహాలయ పక్ష కాలం. 14 రోజుల్లో కుదరని పరిస్థితిలో చివరిరోజు అమావాస్యనాడు అందరి పేరిట విడవవొచ్చు. అందుకే ఆ రోజును 'సర్వపితృ అమావాస్య' అంటారు. దీన్ని కొన్ని ప్రాంతాల్లో పెత్తరమాస అని స్థానిక వాడుకభాషలో పలుకుతుంటారు.

ఎందుకు చేయాలంటే..

మహాలయ అమావాస్యరోజు పితృదేవతలు వారి సంతానం ఇంటి ద్వారం దగ్గరే నిలబడతారని నమ్మకం. వారికి శ్రాద్ధకర్మ నిర్వహించని పక్షంలో సంతానానికి దీవెనలకు బదులు శపించి వెళ్తారని చెబుతారు. మరణించిన వారు మోక్ష ప్రాప్తి కలగాలంటే వారి కర్మ పరిపక్వం కావాలి. అందుకు దేహధారణచేసి.. పితరులు ఈ లోకంలోకి రావాలంటే వారికి అన్నాన్ని అందించాలి. కొందరికి పుత్ర సంతానంలేక శ్రాద్ధ కర్మలు జరగకపోవచ్చు. అలాంటి వారిపేరిట కూడా తర్పణాలు వదలొచ్చు.

★ పితృపక్షంలో ఆ తిథినాడు శ్రాద్ధం పెట్టలేనివారు శ్రాద్ధం, దానం, తర్పణం చేస్తారు. దీని వల్ల సంతానం ప్రాప్తిస్తుందని పురాణాల్లో పేర్కొన్నారు. పితరులను సంతోష పెడితే సంతతికి ఆయువు, విద్య, ధనం, సంతానం కలిగేలా దీవిస్తారని చెప్తారు. శ్రాద్ధకర్మలో నువ్వులు, గూడమిశ్రిత అన్నం సమర్పిస్తే ఆ దానం అక్షయమవుతుంది.

తర్పణాలు వీడేది ఇలా..

పక్షం రోజుల్లో ఏదో రోజు ఒక అతిథిని ఇంటికి పిలిచి పితృదేవతలకు తర్పణాలు వీడాలి. లేదంటే గయవంటి పుణ్యక్షేత్రాలకు వెళ్లి శ్రాద్ధకర్మలు నిర్వహించాలి. అలా కుదరని పక్షంలో వారిని స్మరిస్తూ బ్రాహ్మణుడికి స్వయం పాకాన్ని దానంగా ఇవ్వాలి. తండ్రి చనిపోయిన తిథిరోజు మహాలయం పెట్టడం ఉత్తమంగా సూచించారు. వీలుకాకుంటే మహాలయ అమావాస్యరోజున పెట్టాలి.

బసవతారకం ఆస్పత్రిలో మహిళా రోగులకు ఉచిత కన్సల్టేషన్

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో ఈనెల 20వ తేదీ వరకు మహిళా క్యాన్సర్ రోగులకు ఉచిత కన్సల్టేషన్ ఉంటుందని ఆసుపత్రి వర్గాలు మంగళవారం తెలిపాయి. అక్టోబర్ నెలను రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో 'స్క్రీనింగ్ ప్రోగ్రామ్ ఫర్ ఉమెన్' పేరిట ఈ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. అన్ని పనిదినాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కన్సల్టేషన్ ఉంటుందని, మ్యామోగ్రామ్ పరీక్షల్లో 25 శాతం రాయితీ, ఇతర పరీక్షల్లో 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు వెల్లడించారు. వివరాలకు ఫోన్‌నం.040- 23551235, 23550967లను సంప్రదించవచ్చని సూచించారు.

ఏటీఎంలో డబ్బుల చోరీ ముఠా అరెస్టు: డీఎస్పీ

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: బ్యాంకు ఏటీఎం యంత్రాల్లో సాంకేతిక సమస్యలను సృష్టించి డబ్బులు కాజేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాలో ఇద్దరు దొంగలను మంగళవారం సూర్యాపేటలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ రవి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పట్టణ ఠాణాలో మంగళవారం డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన గౌరవకుమార్, ఉదయ్‌భాను, విమల్ కలిసి సూర్యాపేటలోని పలు ఏటీఎంలే లక్ష్యంగా చోరీలకు పాల్పడాలని పథకం రచించారు. వారు ఇటీవల ఉత్తర్‌ప్రదేశ్ నుంచి ఇక్కడికి వచ్చారు. తమ ఏటీఎం కార్డులను ఉపయోగించి నగదు డ్రా చేసే క్రమంలో యంత్రం నుంచి డబ్బులు బయటకు వస్తుండగా 'లాన్' కేబుల్ తొలగిస్తారు. దాంతో వారి ఖాతా నుంచి డబ్బులు బయటకు వచ్చినప్పటికీ తిరిగి ఖాతాలోకి జమైనట్లు చూపుతాయి. ఈ తరహాలో గత నెల 27న సూర్యాపేటలోని పోచంపల్లి బ్యాంకు ఏటీఎం నుంచి రూ.10 వేలు చోరీ చేశారు. 28న డీబీఎస్ బ్యాంకు ఏటీఎంలో చోరీకి యత్నించి విఫలమయ్యారు. మంగళవారం మరోసారి పోచంపల్లి బ్యాంకు ఏటీఎంకు రావడంతో అరెస్టు చేసి డెబిట్ కార్డులతోపాటు రూ.10 వేలను స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. నిందితుల్లో విమల్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. కేసు ఛేదనకు కృషి చేసిన ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, ఎస్సై కుశలవ, సిబ్బంది కరుణాకర్, కృష్ణ, సైదులు, శివ, మధును అభినందించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	110–00
రిటైల్	132–00
డ్రెస్డ్	191–00
స్కిన్‌లెస్	218–00

EENADU Classifieds

EDUCATION

B.Sc. (Nursing) అడ్మిషన్లకై సంప్రదించండి. Bi.P.C. గ్రూప్‌లో ఇంటర్మీడియట్ పాసైన వారు అర్హులు. అడ్మిషన్ల కొరకు నల్లగొండ పట్టణములోని శ్రీ భావనా కాలేజ్ ఆఫ్ నర్సింగ్. సెల్: 98481 05500, 96529 09766.

JOBS

స్వీపర్లు, వార్డెన్స్ (Male & Female) మరియు హాస్టల్ వర్కర్స్ కావలెను. సంప్ర॥ ఆల్ఫా జూనియర్ కళాశాల, రామగిరి, నల్లగొండ. సెల్: 98486 28045, 79813 00357.

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను/ పేషంట్స్ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం 18k. ✆ 91609 00024, 96404 00073.

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీ/పు॥ ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15-40 వేలు. ఫ్రీ రూమ్ + భో॥ Hyd. 9182260297.

హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లో బ్రాహ్మణ స్త్రీలు మాత్రమే బ్రాహ్మణ కుటుంబంనందు అక్కడే ఉండి వంటకు స్త్రీలు (ఇద్దరు) మరియు కేర్‌టేకర్ కావలెను. Ph: 9866252220.

7th to డిగ్రీ పా/పె ఖాళీగా ఉన్న 32 మంది స్త్రీ/పు లకు ఉద్యోగాలు. జీతం 14000 + 6000 Da + ఫ్రీ రూమ్, భోజనం. నల్గొండ ✆ 85198 91505

TOURS AND TRAVELS

దక్షిణ భారత యాత్ర: 14-10-24 రామేశ్వరం, శబరిమల, కన్యాకుమారి 40 యా. 13 రో. 3-11-24. 6 జ్యోతిర్లింగాలు, పంచద్వారకలు, గుజరాత్, రాజస్థాన్ 51 యా. 14 రో. బ+భో+వ. ✆ 9397617094.

REAL ESTATE

FLAT FOR SALE

సూర్యాపేట 60 ఫీట్ రోడ్, రాయల్ హైట్స్ అపార్ట్‌మెంట్‌లో 2 BHK, 3 BHK ఫ్లాట్స్ అమ్మకమునకు గలవు. సంప్రదించండి. సెల్: 98485 32520.

PLOT FOR SALE

నల్లగొండ పట్టణములో గాంధీనగర్ యాదవ సంఘం ప్రక్కన 637 Square Yards Open Plot అమ్మకమునకు కలదు. ఆసక్తి గలవారు సంప్ర॥ 79813 00357.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

Book Your 5 Lines Classified Advertisement for B/W 355/- COLOUR 440/- (GST 5% Extra) Contact 96528 85838

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 96528 85838
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 99080 16689

(c) eenadu

కోదాడ

•కోదాడ •హుజూర్‌నగర్

ప్రత్యేక పూజలు, అభిషేకాలు

గరిడేపల్లి, న్యూస్‌టుడే: మాసశివ రాత్రి, కృష్ణాంగార చతుర్థి సందర్భంగా కీతవారిగూడెంలోని శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హుజూర్‌నగర్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు పట్టణంలోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు జరిగాయి. తొమ్మిది రోజులపాటు అమ్మవారు రోజుకో రూపంలో దర్శనమిస్తారు.



కీతవారిగూడెంలో స్వామి వారి అలంకరణ

నేరేడుచర్ల, న్యూస్‌టుడే:

? నేరేడుచర్ల పట్టణంలో జాతీయ రహదారిపై హుజూర్‌నగర్ రోడ్డులో వీధిదీపాలు వెలగడం లేదు. ఎవరూ పట్టించుకోవడం లేదు.
– జంపాల వెంకన్న, నేరేడుచర్ల

✔ సమస్య మా దృష్టికి వచ్చింది. వెంటనే చర్యలు తీసుకుంటాం. – బాలునాయక్, డీఈ, జాతీయరహదారుల సంస్థ

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80085 50363 96030 18889

తాగునీరు రావడం లేదని రాస్తారోకో

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: దిర్శించర్ల పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీ ప్రాంతంలో తాగు నీరు రావడం లేదని స్థానికులు మంగళవారం జాన్ పహాడ్ రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. తరచూ మోటారు కాలిపోతుండటం, పంపు ఆపరేటర్ సెలవులో వెళ్లడంతో ఇబ్బంది ఎదురైందని పంచాయతీ కార్యదర్శి రామ తెలిపారు. మోటారు మరమ్మతులు పూర్తయినందున వెంటనే అమర్చి తాగు నీటి సరఫరా చేస్తామని చెప్పారు.



రాస్తారోకో చేస్తున్న స్థానికులు

ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం

నడిగూడెం, న్యూస్‌టుడే: ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, ప్రతిరోజు ధ్యానం చేయడం వల్ల ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని ధ్యాన మండలి ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు, ధ్యానరత్న కాటేపల్లి శైలజ అన్నారు. మంగళవారం నడిగూడెం సాయి మందిర ప్రాంగణంలో ధ్యానంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రయోజనాలు వివరించారు. అనంతరం ఉచిత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ధ్యానమండలి సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు దయాసాగర్, ఎం.శ్రీనివాస్, అచ్చిరెడ్డి, ఉపేందర్, సాయి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి దాతల చేయూత

గరిడేపల్లి, న్యూస్‌టుడే: కీతవారిగూడెం ఉన్నత పాఠశాలకు ఎన్‌ఆర్‌ఐ జుట్టుకొండ వెంకట్ రూ.35 వేల విలువ చేసే రెండు బీరువాలను, ఆఫీస్ ఛైర్, ఎనిమిది కుర్చీలను బహూకరించారు. గతంలో రూ.లక్ష విలువ చేసే కంప్యూటర్, ఇతర సామగ్రి అందించారు. పుట్టిన గడ్డపై మమకారంతో పాఠశాలకు తన వంతు సాయం అందిస్తున్నట్లు వెంకట్ పేర్కొన్నారు. దాతను ప్రధానోపాధ్యాయురాలు సువర్ణ, ఉపాధ్యాయులు, సిబ్బంది సన్మానించారు.



దాతను సన్మానించిన ఉపాధ్యాయులు

మిన్నంటిన బంధువుల రోదనలు

కోదాడ, న్యూస్‌టుడే: కారు కొనేందుకు కోదాడ పట్టణానికి వచ్చి తిరుగు ప్రయాణంలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు యువకులు సోమవారం రాత్రి దుర్మరణం పాలైన విషయం తెలిసిందే. పోలీసులు మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పంచనామా పూర్తి చేసి, పోస్టుమార్టం పూర్తి చేశారు. అనంతరం బంధువులకు అప్పగించారు. కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, చిలుకూరు ఎస్సై రాంబాబు పోస్టుమార్టం, పంచనామా పనులను పర్యవేక్షించారు.



మృతదేహాల పంచనామాను పర్యవేక్షిస్తున్న కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి

క్రైం రిపోర్ట్

❐ బాధిత కుటుంబ సభ్యులు ఆస్పత్రికి చేరుకొని మృతదేహాలను చూసి కంటతడి పెట్టారు. సాయంత్రం 4 గంటలు దాటినా పోస్టుమార్టం పూర్తి కాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. స్వగ్రామాలకు వెళ్లే సరికి రాత్రి అవుతుందని, అంత్యక్రియలు ఎలా చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు.

కేసు నమోదు..

చిలుకూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై మృతుడు వల్లపుదాసు వంశీ తండ్రి భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాంబాబుగౌడ్ తెలిపారు.

నవ వధువు అదృశ్యం

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కాపుగల్లు గ్రామానికి చెందిన కాసాని వీరబాబు(30) ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం పాతకాసారం గ్రామానికి చెందిన ఓ యువతిని(18) గత ఆగస్టు నెలలో వివాహం చేసుకున్నాడు. వీరబాబు చౌటుప్పల్ పురపాలిక పరిధిలోని లింగోజిగూడెంలో నివాసం ఉంటూ.. స్థానికంగా ఉన్న దివిస్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. గత సెప్టెంబరు 28న రాత్రి వీరబాబు పరిశ్రమలో విధులకు వెళ్లాడు. తిరిగి మరుసటి రోజు ఉదయం 7:30 నిమిషాలకు ఇంటికి రాగా భార్య కనిపించలేదు. దీంతో తన భార్య నానమ్మ పార్వబోయిన గోపమ్మను అడిగాడు. చుట్టపక్కల, బంధువుల ఇళ్లలో వెతికిన ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో వీరబాబు మంగళవారం చౌటుప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై యాదగిరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ తెలిపారు.

ఎక్సైజ్ దాడులు

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: హుజూర్‌నగర్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో చేసిన విస్తృత దాడుల్లో 440 కిలోల బెల్లం, ఓ మారుతి వ్యాన్, ద్విచక్ర వాహనం, 9 లీటర్ల సారాను అధికారులు పట్టుకున్నారు. సీఐ నాగార్జున్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మేళ్లచెరువు మండలం కొత్త తండాకు చెందిన ఓర్సు వీరస్వామి, మంగమ్మ దంపతులు వారి ద్విచక్ర వాహనంపై 4 లీటర్ల సారాను తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు. చింతలపాలెం మండలం ఎర్రకుంట తండాకు చెందిన వాంకడోతు రవి, నరేష్ వారి మారుతి వ్యానులో 440 కిలోల బెల్లం, ఐదు లీటర్ల సారాను తరలిస్తుండగా దొండపాడు వద్ద పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ద్విచక్రవాహనం చోరీ.. కేసు నమోదు

మోతె, న్యూస్‌టుడే: సూర్యాపేట-మోతె జాతీయ రహదారి పక్కన మామిళ్లగూడెంలో ఫర్టిలైజర్ దుకాణం ముందు ఉంచిన ద్విచక్రవాహనాన్ని సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. దుకాణం ముందున్న సీసీ టీవీలో ఘటన నమోదు కావడంతో వాహన యజమాని వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై యాదవేందర్‌రెడ్డి తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

మునగాల, న్యూస్‌టుడే: అక్రమంగా కబేళాకు తరలిస్తున్న పశువులను పట్టుకొని, సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసిన ఘటన మంగళవారం మునగాలలో చోటుచేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ వివరాల ప్రకారం.. బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన షేక్ రియాజ్, షేక్ మహమ్మద్‌లు పశువుల వ్యాపారం నిర్వహిస్తారు. కోదాడలో గుర్తుతెలియని వ్యక్తుల వద్ద పశువులను కొనుగోలు చేసి ఓ వాహనంలో హైదరాబాద్‌లోని చాంద్రాయణగుట్టలోని కబేళాకు తరలిస్తుండగా మండల కేంద్రంలో సాధారణ తనిఖీల్లో భాగంగా వాహనాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. వాహనంలో రెండు ఆవులు, ఆరు ఎద్దులను గుర్తించి వాటిని హైదరాబాద్‌లోని జియాగూడ గో సంరక్షణశాలకు తరలించినట్లు పేర్కొన్నారు. వాహనం డ్రైవర్, ఇద్దరు సహాయకులు, ఇద్దరు యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మహాత్ముడి సిద్ధాంతాలు నచ్చి..!




కోదాడలోని ప్రధాన రహదారిపై ఉన్న గాంధీజీ విగ్రహం

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: సత్యమేవ జయతే సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నాదెళ్ల బాలకృష్ణ ఆధ్వర్యంలో 2013లో మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా కోదాడలోని ప్రధాన రహదారి బస్టాండ్ సమీపంలో మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విగ్రహాన్ని అప్పటి గృహ నిర్మాణశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్, ఎమ్మెల్యే చందర్‌రావులు ప్రారంభించారు. సమితి సభ్యులు మహాత్ముని విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు విగ్రహం చుట్టూ గాంధీజీ సూక్తులు రాయించారు. ఏటా గాంధీ జయంతి, వర్ధంతి నిర్వహిస్తున్నారు. ఆర్ అండ్ బీ రోడ్డుకు మహాత్మాగాంధీ రహదారిగా నామకరణం చేయాలని కోరినా అది నేటి వరకు కార్యరూపం దాల్చలేదు.

ఎక్కడా లేని విధంగా ఏర్పాటు..

నాదెళ్ల బాలకృష్ణ, కోదాడ



మానవాళిని అత్యంత ప్రభావితం చేసిన వ్యక్తుల్లో మహాత్మాగాంధీ ఒకరు. గాంధీజీపై అభిమానం, ఆయన సిద్ధాంతాలు నచ్చి కోదాడ ప్రధాన రహదారిలో విగ్రహం ఏర్పాటు చేయాలనే ఆలోచన వచ్చింది. దీంతో ఎక్కడా లేని విధంగా మహాత్ముడు సూర్యచంద్రులుగా ఉండాలనే ఉద్దేశంతో విగ్రహాన్ని ఏర్పాటు చేశాం.

గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు

కోదాడ న్యూస్‌టుడే: కోదాడ పట్టణానికి చెందిన మహిళకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కింది. కుట్లు, అల్లికల విభాగంలో పోటీలను గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధుల బృందం విశాఖపట్నంలో నిర్వహించింది. ఈ పోటీలో కోదాడ నుంచి మహంకాళి వసంతలక్ష్మి పాల్గొని 500 రకాలైన అల్లికలను తయారు చేయడంతో స్టార్ పర్‌ఫార్మర్ ఆఫ్ ది ప్రాజెక్టుగా ఎంపికైన ఆమెకు ఈ అవార్డు దక్కింది. దీంతో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధి స్వప్నిల్ మంగళవారం ఈ అవార్డును వసంతలక్ష్మికి అందజేశారు. పోటీలో తయారు చేసిన అల్లికలను అనాథ పిల్లలకు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విజేత మాట్లాడుతూ వరల్డ్ రికార్డులో చోటు దక్కడం ఆనందంగా ఉందని, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం మరువలేనని తెలిపారు.



విశాఖపట్నంలో ప్రశంస పత్రం, అవార్డు అందుకుంటున్న మహంకాళి వసంతలక్ష్మి

ప్రతి సహాయకుడు సుశిక్షితుడు కావాలి

నడిగూడెం, న్యూస్‌టుడే: గ్రామాల్లో మంచినీటి సరఫరా వ్యవస్థను నిర్వర్తించే ప్రతి మంచినీటి సహాయకుడు (వాటర్ మెన్) సుశిక్షితుడు కావాలని మండల ప్రత్యేకాధికారి సతీష్‌కుమార్, వాటర్ గ్రిడ్ డీఈఈ అభినవ్‌లు కోరారు. మంగళవారం నడిగూడెం రైతు వేదికలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన నడిగూడెం, అనంతగిరి మండలాల నీటి సహాయకుల శిబిరం ముగింపు సమావేశంలో మాట్లాడారు. పైపులైను లీకేజీలు, చేతిపంపు, బోరుబావి, త్రిఫేజ్, సింగిల్ ఫేజ్ మోటార్ల మరమ్మతులు, నీటి నాణ్యతా పరిశీలనపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో ఇమామ్, ఏఈలు ఇర్ఫాన్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: హుజూర్‌నగర్ మండల కార్పెంటర్స్ సమావేశం శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో మంగళవారం జరిగింది. సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘ గౌరవ అధ్యక్షుడు నరసింహరావు అధ్యక్షతన జరిగని సమావేశంలో అధ్యక్షుడిగా బ్రహ్మచారి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సూర్యనారాయణ చారి, ప్రధాన కార్యదర్శిగా ఉపేంద్రచారి, కోశాధికారిగా రాజశేఖర్ ఎన్నికయ్యారు. వీరి ప్రమాణ స్వీకారం అనంతరం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు.



నూతన కమిటీ సభ్యులు

డైవర్షన్ రహదారి పూర్తి చేయాలి

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని గోవిందపురం బ్రిడ్జి వద్ద డైవర్షన్ రోడ్డు వెంటనే పూర్తి చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం యువకులు కోరారు. మంగళవారం అసంపూర్తి రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. పది రోజుల క్రితం రహదారి పోసినా దానిపై సక్రమంగా మట్టి పోయకుండా ఉండటం వల్ల రాకపోకలకు పిల్లలు, వృద్ధులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే అధికారులు చర్యలు తీసుకుని డైవర్షన్ రోడ్డు పూర్తి చేయించాలని కోరారు. కార్యక్రమంలో విమన్, రాంబాబు, జానకి రాములు, జోసఫ్, అంబేడ్కర్ పాల్గొన్నారు.

పూల పండగ.. గిరాకీ మెండుగా

అనంతగిరి, న్యూస్‌టుడే: బతుకమ్మ పండగ అంటేనే పూల పండుగ. తొమ్మిది రోజులు పూలతో పండగ చేస్తుండటంతో బంతి పూలకు ఎక్కువ గిరాకీ ఏర్పడింది. ఇటీవల వచ్చిన భారీ వర్షాలకు బంతి పూల తోటలు దెబ్బతిన్నాయి. దీంతో గతేడాదితో పోల్చుకుంటే దిగుబడి తగ్గిందని రైతులు చెబుతున్నారు. మండలంలో అమీనాబాద్, ఖానాపురం తదితర గ్రామాల్లో బంతి పూల తోటలను రైతులు సాగు చేశారు. వర్షాల నేపథ్యంలో గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది పెట్టుబడి కూడా పెరిగిందని, వర్షాలతో బంతి తోట దెబ్బతినకుండా ఉంటే బతుకమ్మ పండగకు మంచి ఆదాయం వచ్చేదని చెబుతున్నారు. ప్రస్తుతానికి తోటల వద్ద కిలో రూ.100 విక్రయిస్తున్నామని అంటున్నారు.



అమీనాబాద్‌లో బంతి పూల సాగు

శ్రమదానం చేసి.. పారిశుద్ధ్యం చేపట్టి

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: రామస్వామి గట్టు వద్ద గల ఆదర్శ కాలనీలో స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రమదానంతో మంగళవారం పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు.

మునగాల గ్రామీణం, న్యూస్‌టుడే: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామానికి చెందిన మేడ్చల్ డీసీపీ నంద్యాల కోటిరెడ్డి అన్నారు. మాధవరంలో స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా శ్రమదానం నిర్వహించి, పాఠశాల ఆవరణను శుభ్రం చేశారు.



మాధవరంలో శ్రమదానం నిర్వహిస్తున్న కోటిరెడ్డి

చిలుకూరు: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో గిరిబాబు అన్నారు.

క్విజ్ పోటీలతో విద్యార్థుల్లో ఆసక్తి

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: గాంధీ జయంతిని పురస్కరించుకొని స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఆయన జీవిత విశేషాలపై క్విజ్ పోటీలు నిర్వహించినట్లు ఎంఈవో సలీంషరీఫ్ తెలిపారు. ప్రముఖుల జీవిత చరిత్రలపై క్విజ్ పోటీలు ఏర్పాటు చేయడంతో విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతుందన్నారు.

❐ కేఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గాంధీ జయంతిని పురస్కరించుకొని విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎన్.రమణారెడ్డి తెలిపారు. విజేతలకు కళాశాల జూనియర్ అసిస్టెంట్ అన్వేష్ వారి తండ్రి జ్ఞాపకార్థం బహుమతులు అందించారు.

❐ విద్యార్థులు మహాత్మాగాంధీని ఆదర్శంగా తీసుకోవాలని కేఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చందా అప్పారావు అన్నారు. మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా మంగళవారం రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నివాళి అర్పించి మాట్లాడారు.



కోదాడ: క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: సీపీఎం

పాలకవీడు గ్రామీణం, న్యూస్‌టుడే: నిరుపేదలు, మధ్యతరగతి వర్గాల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీపీఎం పయనిస్తున్నట్లు మండల కార్యదర్శి అనంత ప్రకాశ్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పార్టీ సమావేశంలో మాట్లాడారు. గ్రామ కార్యదర్శిగా ఏసురత్నంను ఎన్నుకొన్నట్లు పేర్కొన్నారు.



అమీనాబాద్‌లో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి

నేరేడుచర్ల: అర్హులైన పేదలందరికీ వెంటనే రేషన్ కార్డులు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శేఖర్‌రావు కోరారు. మేడారంలో జరిగిన సీపీఎం సమావేశంలో ఆయన మాట్లాడారు.

నడిగూడెం: సీపీఎం కరివిరాల గ్రామ శాఖ కార్యదర్శిగా కె.భద్రయ్య ఎన్నికయ్యారు.

అనంతగిరి: ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో భాజపా ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. అమీనాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పించారు. కోటేశ్వరరావు, సూర్యనారాయణ, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు న్యాయ విజ్ఞాన సదస్సు

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: గాంధీ జయంతి సందర్భంగా బుధవారం స్థానిక సబ్‌జైలులో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్‌కుమార్, జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ తెలిపారు. మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ సదస్సు అనంతరం కోర్టు ప్రాంగణంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మంత్రి ఉత్తమ్‌కు పలువురి పరామర్శ

హైదరాబాద్, న్యూస్‌టుడే: పితృవియోగం చెందిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని గచ్చిబౌలిలోని ఆయన నివాసంలో మంగళవారం పలువురు నాయకులు పరామర్శించారు. శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి కె.జానారెడ్డి, ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, నాయకులు కనుమూరి బాపిరాజు, తదితరులు పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పద్మావతిరెడ్డి దంపతులను ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు.



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జానారెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

దర్గా అభివృద్ధికి సహకరించండి

పాలకవీడు గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర వక్ఫ్‌బోర్డు నూతన ఛైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ, సీఈవో సయ్యద్ అసదుల్లాను జాన్‌పహాడ్ దర్గా ముజావరు సయ్యద్ జానీ బాబా మంగళవారం హైదరాబాద్‌లో కలిశారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి గాంచిన జాన్‌పాక్ షహీద్ సయ్యద్ మొహినుద్దీన్‌షా రహమతుల్లా అలై దర్గా అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కనీస సౌకర్యాలు లేక భక్తులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి వక్ఫ్‌బోర్డు ద్వారా దర్గా అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు.

విద్యార్థుల్లో సాహిత్యాభిరుచి పెంపొందించాలి

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో సాహిత్య అభిరుచిని పెంపొందించేందుకు ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయిలో కవితల పోటీలు నిర్వహించనున్నట్లు బాల సాహితీవేత్త పుప్పాల కృష్ణమూర్తి, కోదాడ రచయితల సంఘం కోశాధికారి ఎస్.ఎస్.రావులు తెలిపారు. కోదాడలోని వివిధ డిగ్రీ, పీజీ కళాశాలల్లో మంగళవారం కవితల పోటీలకు సంబంధించి గోడ పత్రికలను ఆయన ఆవిష్కరించారు.

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా నాగేశ్వరరావు

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా మేళ్లచెరువు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు నాయిని నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో జరిగిన ఫెడరేషన్ మహా సభల సందర్భంగా ఈ ఎన్నిక జరిగిందని నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. తనను మూడోసారి జిల్లా కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



నాటి కార్మిక చట్టాన్ని అమలు చేయండి

మఠంపల్లి, న్యూస్‌టుడే: 1996నాటి భవన నిర్మాణ కార్మిక చట్టాన్ని సవరణలు లేకుండా అమలు చేయాలని సీఐటీయూ అనుబంధ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యల్క సోమయ్యగౌడ్ డిమాండ్ చేశారు. మంచ్యాతండాలో మంగళవారం జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న అసంబద్ధ నిర్ణయాలతో కార్మిక సంఘాలు పోరాడి తెచ్చుకున్న చట్టం ఉనికిని కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈసందర్భంగా పలువురు కార్మికులు సీఐటీయూలో చేరారు. జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, అనంతప్రకాశ్, ఎస్‌డీ రన్‌మియా పాల్గొన్నారు.

అవగాహన

నడిగూడెం: మత్తు పదార్థాల నిర్మూలనలో యువత భాగస్వామ్యం కావాలని, మత్తుకు దూరంగా ఉండి భవిష్యత్‌కు ఉజ్వల బాట వేసుకోవాలని ఎస్సై బి.అజయ్‌కుమార్ అన్నారు. స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. పాఠశాల సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం

నడిగూడెం: ఎక్లాస్కాన్‌పేటకు చెందిన కిన్నెర మధు ఇటీవల వెల్లడించిన డీఎస్సీ ఫలితాల్లో మంచి ర్యాంకు సాధించాడు. అతని గురువైన నడిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు ఆయనను మంగళవారం సత్కరించారు.

కోదాడ పట్టణం: సమాజ శ్రేయస్సు కోసం స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు నిర్వహించి దిల్లీ వరల్డ్ పీస్ ఆఫ్ యునైటెడ్ నేషన్స్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్న జగిని ప్రసాద్ దంపతులను మంగళవారం సెవెన్ వండర్స్ మిత్రమండలి ఆధ్వర్యంలో సన్మానించారు. మండలి సభ్యులు మధు, అశోక్, శ్రీనివాసరావు, రామకృష్ణ, స్వర్ణభారతి ట్రస్టు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్: విద్యార్థులు, ఉపాధ్యాయులతో బతుకమ్మ ఆడుతున్న మండల విద్యాధికారి సైదానాయక్



కోదాడ: జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నృత్యాలు చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



చిలుకూరు: బతుకమ్మలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

న్యూస్‌టుడే బృందం: తెలంగాణ ప్రత్యేకం బతుకమ్మ. పూలు బాగా వికసిస్తున్నప్పుడు, జలవనరులు పుష్కలంగా ఉన్నప్పుడు వచ్చే పండగ. తీరొక్క పూలు తీసుకొచ్చి పూజిస్తారు. పలు విద్యాలయాల్లో ముందస్తు వేడుకలను మంగళవారం నిర్వహించారు.

అవీ ఇవీ

నిరసన.. నేరేడుచర్ల: పట్టణంలో కార్పొరేట్ హెయిర్ సెలూన్ ఏర్పాటు చేయొద్దని నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. దీర్ఘకాలంగా ఈ వృత్తిలో ఉన్న వారికి ఆర్థికంగా తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉన్నందున వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వినతి.. కోదాడ గ్రామీణం: బాలాజీనగర్‌లో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లల్లో మౌలిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు అందించాలని భారాస పట్టణ అధ్యక్షుడు నయీమ్ అన్నారు. తహసీల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. తహసీల్దార్ వాజీద్‌కు వినతిపత్రం అందజేశారు.

డిమాండ్ .. మేళ్లచెరువు: సిమెంటు పరిశ్రమల్లో పని చేసే కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సైదులు డిమాండ్ చేశారు. సిమెంటు క్లస్టర్ పరిశ్రమ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో దొండపాడులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

నేరేడుచర్ల: కార్పెంటర్స్‌కి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని బీసీ హక్కుల సాధన సమితి ఉపాధ్యక్షుడు ధనుంజయనాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బీమా కంపెనీలకు అప్పగించొద్దు.. హుజూర్‌నగర్ గ్రామీణం: భవన నిర్మాణ కార్మికుల బోర్డును బీమా కంపెనీలకు అప్పగించవద్దని శిల్పకళా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) పట్టణ అధ్యక్షుడు శీలం వేణు కోరారు. ఆ సంఘ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు.

శిక్షణ.. కోదాడ పట్టణం: ఉపాధ్యాయులు ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని ఎంఈవో సలీంషరీఫ్ అన్నారు. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జాలి ఫ్యూచర్స్ ఇన్ ఇంగ్లీష్ శిక్షణ కార్యక్రమం ముగిసిన సందర్భంగా మాట్లాడారు.

మునగాల: ఉపాధిహామీ పనుల గుర్తింపునకు గ్రామసభలు నిర్వహించాలని మండల అభివృద్ధి అధికారి రమేష్ దీన్‌దయాల్ అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకాధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.

మూడురోజులుగా విద్యుత్ కోతలు.. చిలుకూరు: భారాస ప్రభుత్వ హయాంలో విద్యుత్ కోతలు లేని రాష్ట్రంగా మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణను ఉంచారని మాజీ ఎంపీపీ సురేష్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రాంబాబు అన్నారు. మూడు రోజులుగా మండల కేంద్రంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఎక్కువగా ఉందని వాపోయారు.

నివాళి.. మునగాల గ్రామీణం: మందపల్లి వెంకటేశ్వర్లు మృతి బాధాకరమని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున అన్నారు. తాడ్వాయికి చెందిన సీపీఎం నాయకుడు వెంకటేశ్వర్లు మంగళవారం గుండెపోటుతో మృతిచెందడంతో ఆయన మృతదేహంపై కండువా కప్పి నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు, కోట గోపి, మట్టిపెల్లి సైదులు, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

LOST

Lost while travelling from Mellacheruvu to Kodad on 30/09/2024:- Sale Deed No. **5702/2004** dated 21/05/2004 and Gift Deed No. **129/2009** dated 23/01/2009 of Plot No. 855 (MIG), Srvy No. 302 to 310, 320 to 322, 324 to 361, 363 to 365, 384, 385, 387 to 391 and 399 Nallagandla HUDA Colony, Serilingampally Mandal, RR Dist. Pls. contact below if any one finds the same.

Rohini Parvathi B
Plot No. 778, Road No. 23, Vasanthnagar Colony, Kukatpally, Hyderabad - 85.
Ph: 98665 86035

(c) eenadu

సూర్యాపేట
• సూర్యాపేట • తుంగతుర్తి

డీఎస్సీలో ప్రతిభ


గుండగాని సుధాకర్

తుంగతుర్తి, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ పరీక్ష ఫలితాల్లో మండలంలోని వెంపటికి చెందిన గుండగాని సుధాకర్ 77.27 మార్కులు పొంది 39వ ర్యాంకును సాధించారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఈయన గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి, పది వరకు తుంగతుర్తిలో శ్రీ విద్యాభారతి ఉన్నత పాఠశాల ఇంటర్, టీటీసీ సూర్యాపేటలో చదివారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ పూర్తి చేసి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించేందుకు కృషి చేస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు.

భానుపురి, న్యూస్‌టుడే:
? సూర్యాపేటలోని ఆదర్శనగర్‌లో విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా మారింది. రహదారి పక్కనే ఉండటంతో రక్షణ లేక కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. – శ్రీను, ఆదర్శనగర్
✔ రక్షణ కంచె ఏర్పాటు చేయిస్తాం. – శ్రీనివాస్, డిస్కం డీఈ, సూర్యాపేట

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)
సూర్యాపేట: 9154395978
తుంగతుర్తి: 80085 74450

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:
? సూర్యాపేటలోని వినాయకనగర్‌లో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇళ్లలోకి వచ్చి వస్తువులను చిందరవందరగా పడేస్తున్నాయి. – నాగయ్య, వినాయకనగర్
✔ యజమానులతో మాట్లాడి రాకుండా చూస్తాం. – సురేశ్, మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్, సూర్యాపేట

పోటీ పరీక్షల శిక్షణకు చేయూత


పెదనెమిలలో పూజితకు చెక్కు అందజేస్తున్న ఎంఈవో రాములు నాయక్

నూతనకల్ గ్రామీణం, న్యూస్‌టుడే: నిరుపేద కుటుంబంలో పుట్టి సైనిక్ పాఠశాలలో డిగ్రీ పూర్తి చేసి పోటీపరీక్షల శిక్షణకు వెళ్లలేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న మండలంలోని పెదనెమిలకు చెందిన కొమ్ము పూజితకు ప్రవాస భారతీయులు తుమాటి భీష్మ రమాజితి ఆమె తల్లి కత్తురోజు పద్మమ్మ పేర మీద మంగళవారం రూ.50 వేల చెక్కును అందించారు. ఆమె తరఫున బంధువు హరికృష్ణ, ఎంఈవో రాములు నాయక్ మంగళవారం అందజేశారు. ఏటా పేద విద్యార్థులకు చేయూతనిస్తూ ఆదుకోవడం అభినందనీయమని, మూడేళ్లుగా పాఠశాలలో ప్రతిభ చాటుతున్న విద్యార్థులకు చేయూతనందిస్తున్నారని ప్రధానోపాధ్యాయుడు శివయ్య తెలిపారు.

పేద విద్యార్థులకు.. పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలని ప్రధానోపాధ్యాయుడు శంభులింగం అన్నారు. మండలంలోని చీదెళ్ల జడ్పీఉన్నత పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన గోపిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన పెద్ద కుమారుడు వెంకట్‌రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో రాతపుస్తకాలు, పెన్నులు తదితర సామగ్రిని మంగళవారం అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుస్తుల వితరణ.. తుంగతుర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: జడ్పీ ఉన్నత పాఠశాల వెలుగుపల్లిలోని 80 మంది విద్యార్థులకు పాఠశాలలో పనిచేస్తున్న హిందీ ఉపాధ్యాయురాలు కర్పూరం నివేదిత తండ్రి డాక్టర్ నిరంజన్ జ్ఞాపకార్థం రూ 25వేల విలువైన దుస్తులను మంగళవారం అందజేశారు. ఉపాధ్యాయులు అబ్బయ్య, ఎలిజబెత్, జమీల్‌షరీఫ్, కల్పన, నాగయ్య, షాహిదబేగం, యాదయ్య, అవిలేను, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచుకోని.. పంచాయతీలు..!

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: మండలంలోని వివిధ గ్రామాలు, తండాల్లో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభించకపోవడంతో ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాలు అద్దె గదుల్లో కొనసాగుతున్నాయి. అక్కడ వసతులు లేమి కారణంగా అధికారులు ఇబ్బందులు పడుతూ విధులు నిర్వహిస్తున్నారు. సొంత భవన నిర్మాణాలు పూర్తయి నెలలు గడుస్తున్నా ప్రారంభించడంపై దృష్టిసారించడం లేదు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించినప్పటికీ నిరుపయోగంగా ఉంటున్నాయి.

ఎక్కడెక్కడంటే..
2022-23 ఆర్థిక సంవత్సరంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులు ఒక్కో పంచాయతీ భవనానికి రూ.20 లక్షల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసింది. న్యూబంజారాహిల్స్ తండా, గాజులమల్కాపురం, తంగెళ్లగూడెం, లింగాల, చిన్నసీతారాంతండా గ్రామపంచాయతీలకు సొంత భవనాలు నిర్మించారు. నిర్మాణాలు పూర్తిచేసి ఐదు నెలలు గడుస్తున్నా ప్రారంభించకపోవడంతో వృథాగా దర్శనమిస్తున్నాయి. ఏళ్లతరబడి అద్దె గదుల్లో పంచాయతీ కార్యాలయాల నిర్వహణ కార్యదర్శులకు భారంగా మారుతోంది. ఈ కారణంగా అద్దె గదుల కొరత నివారించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సొంత భవనాలను నిర్మించినా నిరుపయోగంగా మారాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

■ సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నూతన పంచాయతీ భవనాలను ప్రారంభించేందుకు తగిన కృషి చేస్తామని ఎంపీడీవో వెంకటేశ్వరరావు చెప్పారు.


న్యూబంజారాహిల్స్ తండాలో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనం

పూల పండగొచ్చె.. గిరాకీ తెచ్చె

నూతనకల్, న్యూస్‌టుడే: బతుకమ్మ ఉత్సవాల్లో ఇబ్బందులు తలెత్తకుండా మండలంలోని గ్రామాల్లో ప్రత్యేక అధికారుల సూచనలతో గ్రామపంచాయతీ కార్యదర్శులు తమ సిబ్బందితో మంగళవారం ఏర్పాట్లు పూర్తిచేశారు. విద్యుత్తు లైట్లు, చెరువులవద్ద జాగ్రత్తలు తీసుకున్నారు.


నూతనకల్‌లో పూలను అమ్ముతున్న దుకాణదారులు

నూతనకల్‌లో రోడ్డువెంట దుకాణదారులు రంగురంగుల పువ్వులు అమ్ముతూ పండగ వేళ ఆకర్షణగా నిలిచారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు శర్మ, సుధాకర్, చలమయ్య, వెంకన్న, శ్రీనాథ్, మధు, ఉమేష్, రమేష్, సత్యవతి పాల్గొన్నారు.

మద్దిరాల గ్రామీణం: మండల కేంద్రం నుంచి పోలుమల్ల వెళ్లే దారిలో రంగుల పువ్వులతో విరబూసి బంతి పూలతోట చూపరులను ఆకట్టుకుంటోంది.

తుంగతుర్తి: మహాలయ అమావాస్య వేడుకలో భాగంగా బుధవారం నిర్వహించే ఎంగిలి పూల పండగకు మహిళలు సిద్ధమవుతున్నారు. కొందరు పూలను కోసుకురాగా.. కొందరు కొనుగోలు చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని నాగుల కుంట వద్ద పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ స్థలాన్ని శుభ్రం చేయించి దీపాలు వేయించారు.

జిల్లా అధ్యక్షుడి నియామకం



ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: తెలంగాణ జన సమితి(తెజస) రైతు విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఆత్మకూర్(ఎస్) మండలం కందగట్లకు చెందిన కొల్లు కృష్ణారెడ్డి నియమితులయ్యారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వహించిన పార్టీ ప్లీనరీలో రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్ ఆయన నియామకాన్ని ప్రకటించినట్లు తెలిపారు. కృష్ణారెడ్డి తెజస ఆవిర్భావం నుంచి మండల పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు.

మండల నూతన కార్యవర్గం ఎన్నిక: తెజస మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని ముక్కుడుదాకు జాటోత్ శ్రీనునాయక్‌ను మండల అధ్యక్షుడిగా, పాతసూర్యాపేటకు చెందిన తండు రాములుగౌడ్ మండల ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా పట్టిసైదులుయాదవ్, రైతు జనసమితి మండల అధ్యక్షుడిగా సామ శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శ్రీశైలంయాదవ్, యువజన సమితి మండల అధ్యక్షుడిగా పుప్పాలసాయి, ప్రధాన కార్యదర్శిగా మహేష్ ఎన్నికయ్యారు.

జిల్లా కార్యదర్శిగా ఎంపిక..



చివ్వెంల, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సూర్యాపేట జిల్లా కార్యదర్శిగా మండలంలోని గుడితండా ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న చిలక రమేష్ ఎంపికయ్యారు. జిల్లా 5వ మహాసభలలో ఆ సంఘం జిల్లా, రాష్ట్ర కమిటీ నాయకుల సమక్షంలో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మంగళవారం ఆయన తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా సంఘంతో కలిసి కృషి చేస్తానన్నారు.

స్వచ్ఛత అందరి బాధ్యత


చివ్వెంల ఎంపీడీవో కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఆశా కార్యకర్తలు, తదితరులు

చివ్వెంల, న్యూస్‌టుడే: ప్రతి గ్రామం, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా మనందరి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని ఎంపీడీవో చక్రాల సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఐటీసీ ఎంఎస్‌కే గ్రీన్ క్రాస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన స్వచ్ఛ మీ సేవా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యాలయం ఆవరణతో పాటు పలు వీధుల్లోని చెత్తను తొలగించి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఎంపీవో దయాకర్, ఏపీవో నాగయ్య, విజయసారథి, గ్రీన్‌క్రాస్ సమన్వయకర్త తండు నాగరాజు, భూక్యా వెంకన్న, ఆశా కార్యకర్తలు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన బొడ్డెమ్మ వేడుకలు


సూర్యాపేట: బొడ్డెమ్మ వద్ద భక్తులు..

నూతనకల్, న్యూస్‌టుడే: నూతనకల్, వెంకేపల్లిలో తొమ్మిదిరోజులుగా నిర్వహిస్తున్న బొడ్డెమ్మ వేడుకలను మంగళవారం భక్తి శ్రద్ధలతో ముగింపు పలికారు. యాస అనంతమ్మ, మాదిరెడ్డి పూలమ్మ, శైలజ, రేణుక, కొల్లు భాగ్యమ్మ, జ్యోతి, యాస చంద్రకళ సాబాది స్వేత, సామ సుమాంజలి, గంగమ్మ, పద్మ, సంధ్య పాల్గొన్నారు.

సూర్యాపేట సాంస్కృతికం, న్యూస్‌టుడే: మహాలయ అమావాస్య ముందు రోజు బొడ్డెమ్మ పండగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆడపడుచులు పుట్టమన్ను తీసుకువచ్చి జాజితో అలికి బొడ్డెమ్మను అలంకరించారు. చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు.


నూతనకల్ శివాజీ నగర్‌లో..

కాల్వలోకి దూసుకెళ్లిన బస్సు.. తప్పిన పెను ప్రమాదం


అదుపు తప్పిన పాఠశాల బస్సు

మిర్యాలగూడ పట్టణం, మిర్యాలగూడ గ్రామీణం, న్యూస్‌టుడే: దైవ దర్శనానికి వెళ్లి వస్తున్న విద్యార్థుల బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కన కాల్వలోకి దూసుకెళ్లి.. పలువురికి స్వల్ప గాయాలైన ఘటన మంగళవారం మిర్యాలగూడ మండల పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి శివారులోని వీవీఆర్ సిటీ సెంట్రల్ పాఠశాలకు చెందిన 30 మంది విద్యార్థులు పాఠశాల బస్సులో మిర్యాలగూడ మండల పరిధిలోని అవంతీపురం గ్రామంలో వెంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చారు. దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో బస్సు బ్రేకులు పడకపోవడంతో అదుపు తప్పి ఓ ఇంటి ప్రహరీను ఢీకొట్టి రోడ్డు పక్కన కాల్వలోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో పలువురు విద్యార్థులకు గాయాలు కావడంతో పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. కాగా ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎంవీఐ లాల్ కోట వీరస్వామి బస్సుకు 2022 నుంచి ఫిట్‌నెస్ లేదని, ఎటువంటి పత్రాలు లేవని గుర్తించారు. మరో వైపు బస్సుకు బ్రేకులు సైతం సక్రమంగానే పని చేస్తున్నాయని.. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగినట్లు గుర్తించామన్నారు. బస్సును సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం.. కొమ్మలే కారణం

భానుపురి, న్యూస్‌టుడే: పట్టణంలోని బాలాజీనగర్, శ్రీరాంనగర్, రామలింగేశ్వర్ థియేటర్, జమ్మిగడ్డ, తదితర కాలనీల్లో చెట్ల కొమ్మలు దట్టంగా పెరిగి విద్యుత్తు తీగలకు తాకుతున్నాయి. విద్యుత్తు సరఫరాలో ఆటంకం ఏర్పడుతోంది. ఇటీవల కురిసిన వర్షం, గాలి దుమారానికి తీగలకు కొమ్మలు తాకి నియంత్రికల వద్ద ఫ్యూజులు, పరికరాలు కాలిపోయాయి. ఇలా తరచూ కరెంటు సరఫరా ఆగి పోతుంటే రెండు మూడు చోట్ల మాత్రమే కొమ్మలు తొలగించి మిగతా వాటిని వదిలేశారు. 'ఎక్కడెక్కడ చెట్ల కొమ్మలు తీగలు అడ్డుగా పెరిగాయో గుర్తించి తొలగిస్తామ'ని డిస్కం డీఈ శ్రీనివాస్ తెలిపారు.



అడుగుకో గుంత.. వాహనదారులకు చింత



భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేటలోని చర్చికాంపౌండ్‌లో రాజారాం కళాశాల రహదారి గుంతలు పడి అధ్వానంగా మారింది. ఈ దారిలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించారు. ఇందుకు రహదారిని తవ్వి సరిగా పూడ్చకపోవడంతో ఎక్కడ చూసినా గుంతలే దర్శనమిస్తున్నాయి. పట్టణ ప్రజలు ఈ రహదారి నుంచి విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారికి రాకపోకలు సాగిస్తుంటారు. అంబేడ్కర్‌నగర్, భగత్‌సింగ్‌నగర్, తదితర కాలనీవాసులు పట్టణంలోకి ఇక్కడి నుంచే వస్తుంటారు. గుంతల కారణంగా వాహనాలు మరమ్మతుకు వస్తున్నాయని, మరమ్మతు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. 'గుంతలు పూడ్చి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూస్తామ'ని పుర కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు.

ఒకే భవనం.. రెండు కార్యాలయాలు

మద్దిరాల, న్యూస్‌టుడే: మద్దిరాల మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు భవనాల కొరత నెలకొంది. ఒకే భవనంలో రెండు కార్యాలయాలు కొనసాగుతుండగా.. పేర్లు పక్కపక్కనే ఉండటంతో వివిధ సమస్యల పరిష్కారానికి వచ్చిన ప్రజలు తికమకకు గురవుతున్నారు. మండల విద్యా వనరుల కేంద్రం(ఎమ్మార్సీ)లో ఇన్నాళ్లు మండల పరిషత్తు కార్యాలయం కొనసాగింది. ఇటీవల ఎంఈవో నియామకం జరగడంతో మరో టేబుల్ వేసి ఆఫీసుగా మార్చారు. పక్కనే ఉన్న గ్రంథాలయ భవనం ఖాళీగా ఉండటంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. నూతన భవనాలు నిర్మించాలని సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు. 'నూతన కార్యాలయాలు నిర్మించే వరకు ఒకే భవనంలోనే రెండు కార్యాలయాలు కొనసాగుతాయ'ని ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి తెలిపారు.


ఎమ్మార్సీ, ఎంపీడీవో కార్యాలయాలున్న భవనం


గ్రంథాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఒక్క భవనమే దిక్కు

రహదారిపైనే మురుగు.. రోగాలకు దరువు



మద్దిరాల, న్యూస్‌టుడే: పల్లెలు శుభ్రపర్చాలనే ప్రభుత్వ సంకల్పం మేరకు ఈ నెల 17 నుంచి స్వచ్ఛతా హీ సేవ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. మద్దిరాలలో మాత్రం మురుగు కాల్వలలో వ్యర్థజలాలు నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తోంది. రహదారులపై గడ్డి పెరిగి, మురుగు పారుతుండటంతో వీధులు అధ్వానంగా మారాయి. దోమలు వ్యాప్తితో రోగాలు ప్రబలుతున్నాయి. పట్టపగలే విద్యుత్తు దీపాలు వెలుగుతుండటంతో కరెంటు వృథా అవుతోంది. 'గ్రామాన్ని సందర్శించి సమస్యలను పరిష్కరిస్తాన'ని మండలాభివృద్ధి అధికారి సత్యనారాయణరెడ్డి తెలిపారు.

బడుల్లో బతుకమ్మ సందడి


నూతనకల్: గుండ్లసింగారంలో బతుకమ్మ వేడుకల్లో విద్యార్థులు

నూతనకల్, న్యూస్‌టుడే: నూతనకల్ మండలంలోని గుండ్లసింగారం బాలికల ఆశ్రమ పాఠశాలతో పాటు యడవెల్లి, తాళ్లసింగారం, చిల్పకుంట్ల ప్రాథమిక, ప్రాథమికోన్నత, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చి వాటిని మధ్యలో ఉంచి ఆడి పాడారు. కోలాటాలతో సందడి చేశారు. అనంతరం స్థానిక చెరువుల్లో వదిలారు. బతుకమ్మ విషిష్టతను కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాల ప్రత్యేక అధికారిని మాదవి వివరించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతనకల్ గ్రామీణం: నవరాత్రి, బతుకమ్మ ముందస్తు ఉత్సవాలను మండల కేంద్రంలోని నాగార్జున ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి తొమ్మిది అవతారాలను ప్రదర్శించి వారి ప్రత్యేకతలను తెలిపారు. అనంతరం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మారగాని విజయలక్ష్మీ, యాదగిరి, రామన్న, రాజేశ్వరీ, సౌమ్య, మథిన్, ప్రియాంక, యశ్వంత్, పావని సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిరాల: మండలవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పెన్‌పహాడ్ జడ్పీ ఉన్నత పాఠశాలలో..

జాజిరెడ్డిగూడెం: మండలంలోని అర్వపల్లి, జాజిరెడ్డిగూడెం, రామన్నగూడెం, పర్సాయపల్లి, కాసర్లపహాడ్ తదితర పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆటా పాటలతో అలరించారు.

తుంగతుర్తి గ్రామీణం: గానుగుబండ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు బతుకమ్మ వేడుకలను జరుపుకొన్నారు. ప్రధానోపాధ్యాయుడు శ్యాంసుందర్, ఉపాధ్యాయులు ఫిరోజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్దిరాల గ్రామీణం: మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు

చివ్వెంల: మండలంలోని తిమ్మాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు వివిధ రకాల పూలను తెచ్చిన బతుకమ్మలను పేర్చి పాఠశాల ఆవరణలో ఆడిపాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: పెన్‌పహాడ్, అనంతారం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయినిలు, విద్యార్థులు బతుకమ్మలను అందంగా తయారు చేసి ఆటా, పాటలతో సందడి చేశారు.

తిరుమలగిరి: మండలంలోని అన్ని పాఠశాలల్లో ముందస్తుగా బతుకమ్మ వేడుకను ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కేజీబీవీ, ఉన్నత, ప్రాథమిక, నెమ్మికల్‌లోని ప్రాథమిక పాఠశాలలో బతుకమ్మలు పేర్చి ఆడిపాడారు. అనంతరం సమీప చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు.


నూతనకల్: మహిషాసుర వధ నాటిక ప్రదర్శనలో విద్యార్థులు


నాగార్జున ఉన్నత పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్న విద్యార్థులు


జాజిరెడ్డిగూడెం: రామన్నగూడెంలో..


తిరుమలగిరిలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో..


సూర్యాపేట: పిల్లలమర్రి శివారులోని చందన నర్సింగ్ కళాశాలలో..


నెమ్మికల్ ప్రాథమిక పాఠశాలలో చిన్నారి విద్యార్థులు పేర్చిన బతుకమ్మలతో ఉపాధ్యాయులు

హామీలను వెంటనే అమలు చేయాలి

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని చీదెళ్ల గ్రామంలో మంగళవారం నిర్వహించిన పార్టీ గ్రామశాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. పేదల పక్షాన నిలబడి పోరాడేది ఒక్క ఎర్రజెండా పార్టీ మాత్రమేనన్నారు. చీదెళ్ల నుంచి మాదవరం, నేలమర్రి, తంగెళ్లగూడెం, చెట్లముకుందాపురం గ్రామాలకు వెళ్లే రహదారులను మరమ్మతులు చేయాలన్నారు. పార్టీ గ్రామశాఖ కార్యదర్శిగా కొండమీది రాములును నూతనంగా ఎన్నుకున్నారు. మడ్డి అంజిబాబు, గుర్రం గోపాల్‌రెడ్డి, మండల కార్యదర్శి రణపంగ కృష్ణ, చినపంగి నర్సయ్య, గోపిరెడ్డి, వెంకట్‌రెడ్డి, లచ్చయ్య, గోపయ్య, వెంకన్న, చిన్న వెంకట్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

హెచ్చరిక ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా! నా క్లయింట్ శ్రీ గుడివాడ ఉదయ్‌కిరణ్, తండ్రి: శేషగిరిరావు, షాబునగర్, మిర్యాలగూడ, నల్లగొండ జిల్లా గారు ఈ దిగువ షెడ్యూల్లో చూపిన వ్యవసాయ భూమిని దాని యజమాని అయిన సుందరి వెంకన్న, తండ్రి: సోమయ్య, గరిడేపల్లి మండలం, సూర్యాపేట జిల్లా గారి నుండి కొనుగోలు చేయుటకు నిర్ణయించి వారికి పెద్ద మొత్తంలో బయానా చెల్లించి వారి నుండి క్రయ అగ్రిమెంట్ పొందియున్నాడు.

సదరు భూమి తాను (1) బొల్లక వెంకన్న, తండ్రి: చిన్న పెంటయ్య మరియు (2) బొల్లక నాగమ్మ, భర్త: సైదయ్య గార్ల నుండి ఖరీదు చేసి రిజిస్టర్ దస్తావేజు నెంబర్ 651/2020 ద్వారా సూర్యాపేట సబ్ రిజిస్టర్ ఆఫీస్‌యందు రిజిస్ట్రీ చేయబడినదని తదుపరి అతనికి పెన్‌పహాడ్ తహశీల్దార్ గారి నుండి T 29200071183 జారీ చేయబడినదని అప్పటి నుండి షెడ్యూల్ భూమి తన స్వాధీనానుభవములో ఉన్నదని తెలియజేసినారు.

సదరు (1) బొల్లక వెంకన్న, తండ్రి: చిన పెంటయ్య మరియు (2) బొల్లక నాగమ్మ, భర్త: సైదయ్య గార్లు బొల్లక లింగయ్య, తండ్రి: చిన పెంటయ్య గారి నుండి సాదా దస్తావేజు ద్వారా ఖరీదు పొంది తదుపరి వారి పేరున రెవెన్యూ రికార్డులలో మొదటి వారికి పట్టేదారు పాసుపుస్తకం T 29200070856 ఖాతా నెంబరు 1251 రెండవ వారికి T 29200070799889 ఖాతా నెంబర్ 1189 జారీ చేయబడినదని తెలియజేసినాడు. బొల్లక లింగయ్యకు సదరు భూమి వారి పూర్వీకుల నుండి సంక్రమించినదని తెలియజేసినారు.

కావున పై లావాదేవీపై ఎవరికైనా ఎలాంటి అభ్యంతరాలు ఉన్న యెడల సాక్ష్యాధారములతో ఈ క్రింది చిరునామాదారుని ఈ ప్రకటన వెలువడిన రోజు నుండి ఏడు పని దినములలో స్వయముగా వచ్చి మీ ఆక్షేపణలు, అభ్యంతరములు తెలియజేయగలరు. లేని యెడల నా క్లయింటు మిగతా క్రయ ధనము చెల్లించి విక్రయ దారుల నుండి సరియగు రిజిస్ట్రీ దస్తావేజు పొందును. గడువు తదుపరి వచ్చిన అభ్యంతరములు చెల్లనేరవు.

షెడ్యూల్: నల్లగొండ జిల్లా రిజిస్టర్, సూర్యాపేట సబ్ రిజిస్ట్రార్, పెన్‌పహాడ్ మండలం, మాచారం రెవిన్యూ గ్రామ శివారులోని సర్వే నెంబరు 298/ఇ ఒక ఎకరం ఆరు గుంటలు, సర్వే నెంబర్ 298/ఆ ఒక ఎకరం ఆరు గుంటలు మొత్తము రెండు ఎకరముల 12 గుంటలు ఈ దిగువ హద్దులలో కలది. ఉత్తరము: బొల్లక లింగయ్య భూమి, దక్షిణము: వీరబోయిన లింగయ్య భూమి, తూర్పు: ఉప్పల పెద సైదులు భూమి, పడమర: దురాజ్‌పల్లి నుండి గరిడేపల్లి పోవు రోడ్డు.

తేది: 01-10-2024
స్థలం: మిర్యాలగూడ

సం/- ఏచూరి శ్రీనివాస్, న్యాయవాది
మిర్యాలగూడ. మొబైల్: 990 860 9090

(c) eenadu